తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక
23వ నవ్వుల వసంతం

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాసపత్రిక సెప్టెంబర్-2025 ₹25






**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

సెప్టెంబర్-2025 23వ సంవత్సరం 255 వ సంచిక

ముఖచిత్రం: నిధి అగర్వాల్

*Publisher& Editor-*
*Ramu.P*

| సంవత్సర చందా- రూ.300/- | 2 సంవత్సరాల చందా- రూ.600/- |
|---|---|

(పోస్టల్ చార్జీలు ఉచితం)

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # **9849630637**

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Full Pillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*

Dr. K.Ramakrishna, Jaydev, Sarasi,
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar, Krishna
GopalKrishna, Gandhi, Nagisetty,
Venkat, Bomman, Dayakar, Sangram,

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:* Surya


*Well Wishers:*

Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Akshagna Vidya Venkat
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*

K.V.V.Satyanarayana
Akshagna Publications
*Cartonist* JSR
K.Sundaresayya & Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Srikanth Sarma

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga, **Risingsun News Agency**
Shop# 5-4-25/b-8, Farman wadi, Abids,
Agarwala Sweets lane, Hyderabad -500001.
Mobile# 9666680857, 6301072906.




*Smile In Every Page... Satisfaction in Every Smile*













# ఎక్కడెక్కడ ఏమున్నాయి?...


**కథలు**

| | | |
|---|---|---|
| అడ్డదారి డబ్బు.... | -గంగాధర్ వడ్లమన్నాటి | -16 |
| సీజన్ మామయ్య-చిన్నారి పెళ్ళి కొడుకు | -డా॥ రామలక్ష్మి.తాడేపల్లి | -20 |
| హోమ్ టూర్ | -లక్ష్మీమదన్ | -36 |
| అపరంజి బొమ్మ | -కట్టా రాంబాబు | -46 |

**శీర్షికలు**

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| స్మైల్‌స్టార్స్ | -భాను | -26 |
| ఇండియన్ ఇంక్ | -రఘుపతి శృంగేరి | -34 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -39 |
| వాక్చిత్రం | -సుధామ | -40 |
| తెలుగా మజాకా? | -డా॥ కప్పగంతు రామకృష్ణ | -42 |
| వెనక్కి వెళ్ళే కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -44 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |

**సీరియల్**

| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -10 |
| సినిమా తీద్దామా? | -గొలుసు సీరియల్ | -28 |

**ప్రత్యేకం**

| | |
|---|---|
| మన హృదయాల్లో నిలచిన 'క్రోక్విల్' శంకు | -15 |
| "నా కార్టూనుకి బహుమతి ఎందుకు రాలేదు?" | -19 |
| ఈడో రకం దొంగ... ఆడో రకం దొంగ | -41 |

## కార్టూన్ శీర్షికలు



| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -12 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -13 |
| నవ్వే మందు | -ప్రసిద్ధ | -38 |
| పంచ్ ఫ్రేమ్ | -కృష్ణ | -31 |
| రిటైర్‌లైఫ్ | -బొమ్మన్ | -40 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -48 |


## ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు

- జయదేవ్
- సరసి
- గాంధి
- బొమ్మన్
- వందన శ్రీనివాస్
- కృష్ణ
- టి.ఆర్.బాబు
- కాజప్రసాద్
- బీవీఎస్
- వినోద్
- అత్తలూరి
- శర్మ
- డేవిడ్
- దొరశ్రీ
- ప్రసిద్ధ
- విజయ్
- రామ్‌శేషు
- సాయికృష్ణ
- శిరి
- చక్రవర్తి
- రావు
- డి.వి.ప్రసాద్
- బాచి
- శేషిరెడ్డి
- కాశ్యప్
- టి.భాస్కర్
- నాథ్
- గుత్తుల శ్రీనివాస్
- భాను
- జేఎన్నెమ్
- ఆదినారాయణ
- సురేష్
- సురేంద్ర
- రఘుపతి శృంగేరి
- తోపల్లి ఆనంద్
- నాగిశెట్టి
- సునీల్
- శేఖర్
- బండి రవీందర్
- వర్మ
- ఓంకార్
- హరి
- శ్రీధర
- క్రిప్
- శ్రీనివాస్
- అర్జున్
- శ్రీనివాస్
- షేక్ సుభాని
- శేఖర్‌బాబు

**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు హాస్యాభివందనాలు!**


**మ**న జీవితాల్లో ఇప్పుడు ముఖ్య భాగమైపోయిన ఒక వస్తువు సెల్‌ఫోన్! మనమిప్పుడు దీనికి ఎంత బానిసైపోయామంటే... ఇది లేనిదే ఏ పని కాదు అనేంత! ముఖ్యంగా డబ్బుల చెల్లింపు విషయంలో ఏటీఎమ్ కార్డుకి మించిపోయింది దీని పాత్ర! బాగుంది! ఒక వస్తువు ఇలా అన్ని విధాల ఉపయోగపడటం హర్షించదగ్గ విషయమే! అయితే రెండవకోణం చూస్తే మాత్రం బాధనిపిస్తుంది. రోడ్డుమీద ఒక చేత్తో బైక్ నడుపుతూ రెండవ చేత్తో సెల్ మాట్లాడుతూ వెళుతున్న వ్యక్తిని చూస్తే భయమూ, కోపమూ రెండూ కలుగుతాయి. లిప్తపాటులో జరిగే సంఘటనకు కారణమయ్యే ఈ దుశ్చర్య స్వయంకృతాపరాధము కాదా? డాక్టర్లు- దీనినుండి వెలువడే రేడియేషన్ మంచిది కాదు అని చెప్తున్న... 'సె(హె)ల్'ని కౌగిలించుకుని పడుకుంటున్న కొందరికీ ఎప్పటికి అర్థమవుతుందో?... మనం ఎక్కువగా ఫోన్‌లో కాలక్షేపం చేయడం వలన కుటుంబ సభ్యులతో బంధాలు బలహీనపడతాయి. నలుగురు మనుషులు ఒక చోట ఉన్నా అందరీ చేతుల్లో సెల్‌ఫోన్... తల వంచుకుని కూర్చున్న మనుషులు మనకు ప్రత్యక్షసాక్ష్యాలు! ఇంకో బాధాకరమైన విషయం ఏమిటంటే చిన్నపిల్లల చేతిలో ఇదిప్పుడు తప్పనిసరి అయిపోయింది. వాళ్ళు తిండి తినాలన్నా... ఏడుపు ఆపాలన్నా... ఇంట్లో తిరుగుతూ ఆడుకోకుండా, ఒక చోట కూర్చోవాలన్నా... వారి చేతిలో 'ఇది' పెట్టేస్తున్నారు అమ్మలు! పాపం బాల్యం!

దీనికి బానిసైపోవటం వలన పనితీరు తగ్గిపోవటం మన గమనిస్తూనే ఉన్నాం! రైల్వే, బస్టాండుల్లో బుకింగ్ కౌంటర్లలో కిలోమీటర్ లైను ఉన్నా... సదరుఉద్యోగి ఫోన్‌లో మాట్లాడటం అతని నిర్లక్ష్యానికి నిదర్శనం! మరో ముఖ్య విషయం రాత్రి 11 గంటలకు ఫోన్‌చేసి 'పడుకున్నారా?' అని అడగటం!... ఫోన్ చేసే వ్యక్తి ఖాళీగా ఉంటే చాలూ... ఎవరికి ఫోన్ చేయాలా అని ఒక నెంబరు నొక్కుతాడు. 'దీని' వలన కొన్ని మర్యాదలు పాటించటం కూడా వదిలేశారు జనాలు. మొత్తంమీద చెప్పొచ్చేదేమిటంటే... సెల్‌ఫోన్‌ను అవసరానికి అనుగుణంగా వాడుతూ... ఫోన్‌ని 'ఇలానే' వాడాలి అని నలుగురికి చెబుదాం!

అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...



## మీ సౌండ్!




✦ **శ్రీలేఖ పి.ఎస్. సికింద్రాబాద్**

**యీ**సారి రామకృష్ణ గారి రచన 'తెలుగా మజాకా' ఇవ్వలేదు. హాస్యంతో బాటు వ్యాకరణం మిస్ అయ్యాము. అట్ట మీద బొమ్మ –గణపతి... 'తన ముఖచిత్రం ఉన్న హాస్యానందం పత్రిక చదవడం' సృజనాత్మకంగా ఉంది. అత్యద్భుతం! బన్ను గారి కార్టూన్–"నీ సీటు చూస్తూనే ఉన్నా..." సూపర్బ్. కొత్తగా ఉన్నది. డాక్టర్ షహనాజ్ బతుల్ గారి కథ తను, ఆమె, ఒక ప్రయాణం" కథ కొత్త కొత్తగా ఉన్నది. అబ్బాయి పెళ్లి (జయదేవ్), నవ్వు కొమ్మచ్చి (సరసి), పంచ్ ఫ్రేమ్ (కృష్ణ), నెల నెల నవ్వుల వెన్నెల ... దేనికదే సాటి. నలుగురు నలుగురే అన్నట్టు. హ్యాట్సాఫ్.

✦ **కె.ప్రమీలారాణి, బెంగళూరు**

**గ**ణపతి ముఖచిత్రం చాలా బాగుంది. ఆ గణాధిపతి ఆశీస్సులు హాస్యానందం మీద ఎల్లప్పుడూ ప్రసరింపుగాక! మీ కృషికి ఆ నవ్వుల నాయకుని చల్లని దీవేనలు మీకెప్పుడూ ఉంటుంది. ఈ సంచికలో ప్రచురించిన కథలు, కార్టూన్లు చాలా బావున్నాయి.

✦ **పి. వి. పద్మావతి మధు నివ్రితి, హైదరాబాద్**

**హాస్యానందం అంటే ఎవరు?...** హాస్య పత్రికల్లో మెగాస్టార్... హాస్య పత్రికల్లో భూషణం... హాస్య పత్రికల్లో రత్నం... హాస్య పత్రికల్లో సామ్రాట్!

**హాస్యానందం అంటే ఏమిటి?...** కడుపుబ్బ నవ్వు తెప్పించే ఔషధం... నొప్పులు బాధలు మర్చిపోయేలా చేసే డాక్టర్... సంతోషపు హార్మోన్లు (డోపమైన్–సెరోటోనిన్–ఎండార్ఫిన్స్–ఆక్సిటోసిన్) ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది.

**హాస్యానందం అంటే ఎలా?...** రాత్రిపూట నిద్ర ఇచ్చే హార్మోన్లను (మెలటోనిన్ ను) ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది.... ఆరోగ్యం మంచిగా–బాగుంటుంది... మనసు హృదయం తేలిక పడుతుంది!

✦ **ఆర్.గోపాలకృష్ణ, నెల్లూరు**

**హా**స్యానందం మా ఆనందానికి ఆలంబన. తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యపత్రిక ఇంత వైభవంగా వెలువడటం పాఠకులైన మాకు గర్వకారణం! ఆగష్టు సంచికలో ప్రచురించిన కథలు అన్నీ బావున్నాయి. ఇంతకు ముందు ప్రత్యేక సంచికలు వేసే హాస్యానందం ఎందుకో ఈ మధ్య ప్రత్యేక సంచికలు వెలువరించటం లేదు! గొప్ప ప్రయోగమైన అవి మళ్ళీ వేయండి! కార్టూన్లకు పెద్దపీట వేస్తున్న హాస్యానందంకు అభినందనలు!



## పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక

# దసరా కార్టూన్ పోటీ

'జ్యోతిష విశారద' **శ్రీ పాలపర్తి శ్రీకాంత్ శర్మ** వారి తల్లిదండ్రుల స్మారకార్థం ఈ పోటీ నిర్వహిస్తున్నారు.

## సైలెంట్ స్మైల్

**కాప్షన్‌లెస్ కార్టూన్ పోటీ**

**ఒక్కో కార్టూన్ కి 1000 రూపాయలు**
**చొప్పున10 బహుమతులు**

ఈ **కాప్షన్‌లెస్** కార్టూన్ పోటీలో కార్టూన్లు సులభంగా అర్థమయి నవ్వొచ్చే వాటికే మొదటి ప్రాధాన్యత!

**బహుమతి పొందిన కార్టూన్లతో పాటు బాగున్న కార్టూన్లు అక్టోబర్ సంచికలో ప్రచురిస్తాం!**

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ: **సెప్టెంబర్-05, 2025**

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను–
**hasyanandampoteelu@gmail.com**


# బాచి అవార్డు -2025 పురస్కారం మరియు
# శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీ విజేతలకు
# బహుమతి ప్రదానోత్సవం!




**రో**టరీక్లబ్ విజయవాడ సెంట్రల్ వారు నిర్వహించిన సభలో...కార్టూనిస్టు శ్రీ బాచి గారు వారి తల్లిగారు- శ్రీమతి అన్నం భాగ్యవతి పేరిట నిర్వహించిన కార్టూన్ల పోటీ విజేతలకు మరియు కార్టూన్ ఇష్టులు శ్రీఎస్.వి. రమణ గారు వారి తల్లి దండ్రులు శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి వార్ల స్మారకంగా నిర్వహించిన కార్టూన్ పోటీలో గెలుపొందిన కార్టూనిస్టులకు బహుమతి ప్రదానోత్సవం ఆగస్టు 15న విజయవాడలో బాలోత్సవ భవ నంలో సాయంత్రం 6 గంటలకు వైభవంగా జరిగింది.

ఈ సభలో ప్రముఖ కార్టూనిస్టు శ్రీ సరసి గారి 'పెళ్ళి కార్టూన్లు', 'సంగీతం కార్టూన్లు', పుస్తకాలు... ఇంకా బాచిగారు చెట్లపై వేసిన కార్టూన్ పుస్తకం 'ట్రీ కార్టూన్లు', పద్మదాస్‌గారి 'నవ్వుల పువ్వులు' కార్టూన్ పుస్తకం... ఆవిష్కరించారు.

శ్రీ ఎస్.వి.రమణగారు ప్రతియేట ఇస్తున్న, శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి పురస్కారం ఈ యేడాది ప్రముఖ కార్టూనిస్టు శ్రీ అరుణ్‌గారికి బహుకరించారు.




డా॥కప్పగంతు రామకృష్ణ గారు సభను ఆద్యాంతం ఆహ్లాదంగా నిర్వహించారు.










## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


**4500 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.






**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమతిగా **1000 రూపాయలు ఇస్తున్నారు.**


← మొదటి బహుమతి- **రూ.500/-లు**
↙ రెండవ బహుమతి- **రూ.300/-లు**
↓ మూడవ బహుమతి- **రూ.200/-లు**







**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు**
**ఒకో కార్టూన్‌కి రూ.500/-లు**
**చొప్పున ఈ రెండు కార్టూన్లకు**
**1000 రూపాయలు**
బహుమతి ఇస్తున్నారు.


AKSHAGNA
PUBLICATIONS







**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.









కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి **500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.




**ప్రతి నెలా బహుమతులే!**

ప్రతి నెలా హాస్యానందంకు
వచ్చే కార్టూన్లలోంచి
**8 మంచి కార్టూన్లకు బహుమతులు**
ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు!



కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**





# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగపిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండోవాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. సాత్వికరావు ఆత్మహత్య ప్రయత్నంలో బతికిపోయి...లలిత దగ్గరకు చేరతాడు. బోసు కూడా ఆత్మహత్య విఫలయత్నంలో రాధకి ఎదురౌతాడు... **ఆ తర్వాత...**

ఇంక లాభం లేదనుకొని భద్రం తన అసిస్టెంట్‌కి సైగ చేసి చెవిలో ఏదో చెప్పాడు.

అతడు వెళ్లి పదినిముషాల్లో రాధను ఆటోలో అక్కడికి తీసుకొచ్చాడు.

అచ్చు తన భార్యలా ఉన్న ఆమెను చూసి బోసు ఆశ్చర్యపోయాడు.

రాధ తడి కళ్ళతో... "నేనారోజు కోపం కొద్దీ అలా మీ చెంప పగలగొట్టాను. అంత మాత్రాన మీరు ఆత్మహత్య చేసుకుంటారా? రండి ఇంటికెళ్దాం" అంది.

"చెంప పగలగొట్టావా? ఏమిటి నువ్వు మాట్లాడేది? పైగా ఆత్మహత్య చేసుకుంటానని నేన్నీకు ఉత్తరం రాశానా?"

"అవునండీ. ఇందాకేగా మన హోటల్‌కి వచ్చి ఇచ్చి వెళ్ళారు."

"మన హోటలా? ఏమిటే నువ్వు మాట్లాడేది? మతి పోలేదు కదా?"

"ఇదిగో సాత్వికరావ్! పోన్లే గదాని మిమ్మల్ని 'అండీ' అంటూ మర్యాదగా సంబోధిస్తూ ఉంటే మీరు నన్ను 'ఏమే' అంటున్నారు? నేనేం మీ పెళ్ళాన్ని అనుకుంటున్నారా?"

"ఏవిఁటీ? నువ్వు నా పెళ్ళానివి కాదా?" అంటూ ఆమె మెడ వైపు చూసి ఆశ్చర్యపోయాడు.

"అప్రాచ్యురాలా! నాతో పోట్లాడి ఆ మంగళ సూత్రం కూడా తీసి పారేశావా? ఇదంతా ఆ 'ఆడదాని మూడో కాలు' సీరియల్ ఎఫెక్టేగా! ఎంత పొగరే నీకు?"

"ఏయ్ మిస్టర్! పిచ్చి మాటలు మాట్లాడకు. నువ్వు నా భర్తవా? సిగ్గు లేదూ?"

చంద్రబోస్‌కి ఒళ్ళు మండిపోయింది.

"పేరు కూడా రాధ అని మార్చేసుకున్నావా? ఇంకెవడినో పెళ్ళిచేసుకోవాలనేగా నీ ప్లాను?" అంటూ మండిపడ్డాడు.

"ఈయనకు పిచ్చెక్కినట్లుంది భద్రం! మెంటల్ హాస్పిటల్‌కి తీసుకెళ్తే మంచిదేమో?"

"అవునమ్మా! నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఉండండి. ట్యాక్సీ తీసుకొస్తాను!" అంటూ పరుగుతో వెళ్ళాడు.

"ఏమిటి? నాకు పిచ్చెక్కిందా?... ఈ రకంగా నా పీడ వదిలించేసుకుందామని చూస్తున్నావు కదూ?!" అంటూ గట్టిగా అరిచాడు.

ఆ గొడవకు రోడ్డుమీద జనం పోగవటం... అప్పుడే భద్రం టాక్సీ తేవటం ఒకేసారి జరిగిపోయాయి. జనమంతా కలిసి చంద్రబోస్‌ని బలవంతంగా ట్యాక్సీ ఎక్కించేశారు.

ఆస్పత్రిలో సైకియాట్రిస్ట్ చిరునవ్వుతో అతనిని ఆహ్వానించాడు. అతనడిగిన మొదటి ప్రశ్న, "ఇన్సూరెన్స్ ఉందా?"

రాధ లేదన్నాక అప్పుడు– "వాటీజ్ ది ప్రాబ్లం?" అని అడిగాడు.

"నేను పెళ్ళిచేసుకోవటానికి నిరాకరించానని ఆత్మహత్య చేసుకోవటానికి వెళ్ళారండీ! ఎలాగోలా వెతికి పట్టుకున్నాం గానీ, అప్పటికే మతి స్థిరం తప్పింది."

"అబద్ధం డాక్టర్! నా భార్యను పెళ్ళి చేసుకోమని నేనెందుకడుగుతాను? తానే మంగళ సూత్రం తెంపేసుకుని పేరు కూడా మార్చేసుకుంది."

"మీరు 'మాంగల్యానికి నాలుగో ముడి' సీరియల్ గురించి మాట్లాడుతున్నారా?"అని ప్రశ్నించాడు డాక్టరు.

"లేదు డాక్టర్! 'ఆడదాని మూడో కాలు' గురించి మాట్లాడుతున్నాను".

"ఓహో అలాగా? రండి, మనిద్దరం లోపలికి వెళ్లి మగాడి మొదటి కాలు గురించి మాట్లాడుకుందాం..." పేషెంట్ కి నచ్చచెపుతున్నట్టూ అన్నాడు డాక్టరు.


ఇద్దరూ లోపలికెళ్ళారు. ఆ రూంలో తలుపు వెనుక దాక్కుని ఉన్న ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి చంద్రబోసు రెండు చేతులూ విరిచి పట్టుకొని టేబుల్ మీద పడేసి బెల్టులు బిగించారు.


ఆ తరువాతేం జరిగిందో తెలీదు. తిరిగి కళ్ళు తెరిచే సరికి బోసు ఓ మంచం మీద ఉన్నాడు. రాధ ఆత్రుతగా ముఖంలోకి తొంగి చూస్తోంది. ఆమె కళ్ళ నిండా నీళ్ళు ఉన్నాయి.

"సాత్విక్! ఎలా ఉందిప్పుడు? నన్ను గుర్తు పట్టారా?" అంది ప్రేమగా.

"సాత్వికా?... సాత్విక్కేమిటి? నా పేరు బోస్! నువ్వు పేరు మార్చేసుకొని ఇంకోడెవడో సాత్విక్ అనేవాడితో లేచిపోవాలని చూస్తున్నావు. అందుకే నన్నిలా పిచ్చాసుపత్రిలో పడేశావు".

"చూశారా! మీ షాక్ ట్రీట్‌మెంట్ ఏమాత్రం పని చేయలేదు" అంది రాధ డాక్టరు వైపు తిరిగి






"ఏం పర్లేదులెండి. ఈసారి ఇంకాస్త పెద్ద షాకిస్తాను!" అన్నాడు డాక్టర్.

చంద్రబోసు అదిరిపడ్డాడు.

తనిప్పుడు వాళ్ళు చెప్పినట్టల్లా చెయ్యకపోతే ఇలా షాకులపై షాకులిస్తూనే ఉంటారని వెంటనే మాట మార్చేసి...

"సారీ రాధా! ఇందాకటి నుంచీ నిన్ను చూసి లలిత అనుకున్నాను!" అన్నాడు.

రాధ మొహం విప్పారింది.

"అబ్బ! ఎంత త్వరగా ఫలితం కనిపించిందండీ! ఇవి ఎన్ని వేళ్ళో చెప్పండి చూద్దాం!" అంది నాలుగు వేళ్ళు అతని కళ్ళ ముందు ఉంచుతూ.

"నాలుగు రాధ వేళ్ళు. లలితవి కాదు" అన్నాడు చంద్రబోసు తడబడుతూ.

"వెరీ గుడ్! నా ఫీజు ఇచ్చి మీరిక ఇంటికి వెళ్లిపోవచ్చు!" అన్నాడు డాక్టర్.

అందరూ టాక్సీలో రాధ ఇల్లు చేరుకున్నారు.

"రండి! ఇదే మనిల్లు" తాళం తీసి లోపలకు నడుస్తూ అంది.

"వచ్చేవారంలోనే మనం గుడికి వెళ్ళి దండలు మార్చుకుందాం!... సరేనా?"

"పెళ్ళా? అయితే నువ్వు ఒప్పుకున్నావన్న మాట!" అన్నాడు ఆనందం నటిస్తూ.

"అవునండీ! ఇందాకే మా డాడీకి టెలిగ్రామిచ్చాను. రేపటికల్లా వచ్చేస్తారు".

"ఆc...ఆc...అవును. మీ డాడీ... మీ డాడీ!"

"ఆయన ఆర్మీలో కల్నల్ కదా! పర్లేదులెండి. నా స్వంత హోటల్ విషయంలోనూ, పెళ్ళి విషయంలోనూ ఆయన పూర్తి స్వేచ్ఛ నాకే ఇచ్చారు. అందుకే సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్ లో హోటల్ పెట్టి నా కాళ్ళ మీద నేను నిలబడ్డాను."

చంద్రబోస్‌కి అంతా అగమ్యంగా ఉంది. కొంపదీసి 'రాధ' పేరుతో తనని బాధ పెడుతున్న ఈ పిల్ల లలిత పోలికలున్న ఇంకో అమ్మాయి కాదు గదా?... ఆ ఆలోచన రాగానే అతని గుండెలు ఝల్లుమన్నాయి. అవును! అలా జరిగే అవకాశాలున్నాయి!

అయితే మరో అనుమానం. లలిత పోలికలతో ఈ రాధ ఉందనుకున్నా, ఆమె తనను పట్టుకుని సాత్వికరావు అంటుందేమిటి?

ఈ అయోమయం భరించలేక వీలయినంత త్వరగా అక్కడి నుంచి పారిపోవాలని నిశ్చయించుకున్నాడు. పారిపోయే ముందు ఈ మిస్టరీ ఛేదించాలి.

"మీరా గదిలో పడుకోండి! కాసేపు విశ్రాంతి తీసుకుంటే నార్మల్ అయిపోతారు." అంటూ బయటకు వెళ్ళి తలుపు మూసేసింది.

ఆమె గదిలోంచి వెళ్ళగానే టేబుల్ దగ్గరకు వెళ్లి అక్కడున్న ఫోటో చూశాడు.

తల్లిదండ్రులతో రాధ కలిసి దిగిన ఫోటో.

లలిత తల్లిదండ్రులు అలా ఉండరు. సో... రాధ వేరు. లలిత వేరు.


అర్ధరాత్రి ఎప్పుడవుతుందా అని ఎదురు చూస్తూ కూర్చున్నాడు. రాత్రి పదకొండు గంటల నలభై నిముషాలైంది.

✦✦✦

రాత్రి పన్నెండు అయింది.

ఆనందరావు హుషారుగా విజిల్ వేసుకుంటూ రోడ్ మీదకొచ్చాడు. రాధ గుర్తొచ్చింది. ఆమె గుర్తుకు రాగానే శరీరమంతా వేడెక్కి పోయింది.

ఆ రోజు హోటల్లో కాఫీ తాగుతూ కౌంటర్



దగ్గర కూర్చున్న ఆమెను చూశాడు.

అంతే..! ఎలాగయినా ఆమెను స్వంతం చేసుకోవాలనిపించింది. అందుకే ఆ రోజు రాత్రి సాహసం చేసి ఆమె ఇంట్లో జొరబడ్డాడు.

అక్కడే జీవితంలో మొట్టమొదటి సారి పరాజయం పొందాడు. తన ఆకర్షణకు లొంగిపోయే 93 శాతం లోకి ఆమె రాలేదు. గత్యంతరం లేక ఆమె ఇంట్లోంచి పరుగు పరుగున బయటపడ్డాడు.

రూపం మాత్రం గుండెల్లో శాశ్వతంగా ఉండి పోయింది. అప్పుడప్పుడూ అది గుర్తుకొచ్చి మనసుని కలచి వేస్తూ ఉంటుంది.

నెమ్మదిగా ఆమె ఇంటి వైపు అడుగులు వేయసాగాడు.

అర్థరాత్రి అవటం వల్ల రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. రాధ ఇంటి కాంపౌండ్‌లోకి వచ్చి కిటికీ లోంచి లోపలకు తొంగి చూశాడు.

బ్లూ నైట్ బల్బ్ కాంతిలో రాధ నీలం రంగులో కనబడుతోంది.

ఇంట్లోకి ఎలా జొరబడాలా అనే విషయం అతనికి అర్థం కాలేదు.

సరిగ్గా అప్పుడే తలుపు తెరుచు కుంటున్న చప్పుడయి చప్పున పూలమొక్కల చాటున నక్కి కూర్చున్నాడు.

లోపల్నుంచీ చంద్రబోసు దొంగలాగా నక్కి నక్కి బయటికొచ్చి అక్కడి నుంచీ వేగంగా పరుగు మొదలు పెట్టాడు.

లైటు వెలుగులో అచ్చం తన రూపంతోనే ఉన్న చంద్రబోస్‌ని చూసి ఆనందరావు నిర్ఘాంతపోయాడు... మరీ ఇంత పోలికా?

హఠాత్తుగా అతనికి ఒక అద్భుతమయిన ఉపాయం తట్టింది. తనను పోలి ఉన్న వాడితో రాధకు సంబంధం ఉన్నట్లుంది. కనుక తనిప్పుడు లోపలికెళితే తనని ఆ వ్యక్తే అనుకునే అవకాశం ఉంది. అలా అనుకుంటే ఇక తన కోరిక తీరినట్టే.


చకచక లోపలకు నడిచాడు. రాధ గది తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి.

నెమ్మదిగా తలుపులు తెరుచుకొని లోపలకు నడిచాడు.

నవ్వు కొమ్మచ్చి



సరసి






రాధ అందం అతనిని పిచ్చివాడిని చేస్తోంది.

నెమ్మదిగా ఆమె మీదకు వంగి పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

రాధ చటుక్కున కళ్ళు తెరిచి 'మీరా!' అంది ఆశ్చర్యంగా.

ఆనందరావు పూర్తిగా ఆమె మీదకు ఒరిగిపోయి– "అవును, నేనే!" అన్నాడు.

ఆమె అతని కౌగిలి నుంచి ఇబ్బందిగా పక్కకు జరిగి... "వెళ్ళి మీ గదిలో పడుకోండి!" అంది సున్నితంగా.

ఆమెను మరింత గాఢంగా అల్లుకుపోవటానికి ప్రయత్నిస్తూ... "ఉహు! నిద్ర రావటం లేదు!" అన్నాడు.


రాధకు కోపం వచ్చింది గానీ తమాయించుకుంది. "ఇలా ఇప్పుడే నాకిష్టం లేదు. పెళ్ళయ్యాక మీ ఇష్టం!" అంది దూరంగా జరిగి.

"పెళ్ళిదేముంది? ఎప్పుడంటే అప్పుడే. ఇప్పుడంటే ఇప్పుడు!" ఏం బిస్కట్ వెయ్యాలా అని వెతుక్కుంటూ అన్నాడు.

రాధకు ఆశ్చర్యంగా ఉంది. ఇంతవరకూ "నువ్వు రాధవు కాదు. నాకు లలితతో పెళ్ళయిపోయింది. ఇది మా ఇల్లు కాదు" అన్న వ్యక్తేనా ఇతను? అనుకుంది.

చీర కుచ్చిళ్ళు లాగుతున్న అతని చేతిని విసిరి కొట్టి– "రేపెలాగూ మా డాడీ వస్తారు కదా! అప్పుడే పెళ్ళి డేట్ కూడా ఫిక్స్ చేసుకుందాం! మహా అయితే వారం. వారం రోజులు ఆగలేరూ?" అంది.

"వారం రోజులేమిటి? పదేళ్ళయినా వేచి ఉండగలను నీకోసం.కానీ ఈ ఒక్క రోజుకీ..."




బిస్కట్ కోసం మళ్ళీ వెతుక్కున్నాడు.

"అయాం సారీ!... దుప్పటి ముసుగు పెట్టుకుని పడుకోండి!" అంటూ బలవంతంగా మంచం మీదకు తోసి బయటకు పరుగెత్తి, గది తలుపులు మూసేసింది.

"రాధా...రాధా...ఒక్కసారి తలుపు తియ్. నేను మా ఇంటికి వెళ్ళి పడుకుంటాను ప్లీజ్" అంటూ అతనెంత బ్రతిమాలినా లాభం లేకపోయింది. మంచం మీద పడుకుంటూ...

'రాధ చేతిలో దెబ్బ తినటం ఇది రెండోసారి. పెళ్ళి చేసుకుని ఓ వారం అనుభవించి వదిలేసి పోతే, నాలాటి మొహం ఉన్న ఇంకెవడి మీదో ఈ నేరం పడుతుంది. చెప్పుకోలేక పీక్కోలేక ఇద్దరూ ఛస్తారు. అప్పుడు గానీ నా కసి తీరదు!" అనుకున్నాడు.

✦✦✦

"చేతులు పైకెత్తు! అటూ ఇటూ చూడకు. అతి తెలివి ప్రదర్శించినా, ఏవైనా పిచ్చిపిచ్చి వేషాలు వేయటానికి ప్రయత్నించినా పుచ్చ పేలిపోద్ది. మెడ వెనుక పెన్ను పెట్టి బెదిరిస్తున్నామని అనుకుంటున్నావేమో.కాదు! ఇది పిస్టల్. అందులో గుళ్ళు కూడా ఉన్నాయి. కావాలంటే అక్కడికి వెళ్ళాక నువ్వు పరీక్షించుకోవచ్చు..." అంటూ పాకిస్తాన్ గూఢచారులు బెదిరించి అతడిని ఒక నిర్మానుష్యమైన ప్రదేశానికి తీసుకువెళ్లారు.

అక్కడికి వెళ్ళాక, "నువ్వు మాకో పని చేసి పెడితే 500 ఇస్తాం!" అన్నాడు త్రిబుల్‌జీరో.

"ఏం చెయ్యాలి?"

"మేము నిన్ను ఒక చోటకి తీసుకువెళ్తాము."

"వెళ్తే?"

"అక్కడ డ్రాయర్ తెరవాలి." **(సశేషం)**


**థంబ్ నెయిల్ తమాషాలు**

LIKE & SHARE

యూట్యూబ్‌లో ప్రతి కథకి ఒక థంబ్‌నెయిల్ ఉంటుంది....
ప్రతి థంబ్‌నెయిల్‌కి ఒక టార్గెట్ ఉంటుంది.
వాళ్ళ టార్గెట్ మాటెలా ఉన్నా... మీరు ఫూల్ అయినా సందర్భాలు
చాలానే ఉంటాయి కదా?.... అవే మీ కథ వస్తువు, కార్టూన్ క్యాప్షన్!
కథ రాయండి! (ఒక పేజీలోనే) కార్టూన్ గీయండి!
వెయ్యి రూపాయలు చొప్పున పది కథలకు...
500 రూపాయలు చొప్పున 10 కార్టూన్లకు బహుమతులు!
మీ కథలు, కార్టూన్లు అక్టోబర్ 1లోగా పంపండి!

నవంబర్ హాస్యానందం **థంబ్‌నెయిల్ తమాషాలు** ప్రత్యేక సంచికగా వెలువడుతుంది!

# మన హృదయాల్లో నిలచిన 'క్రోక్విల్' శంకు



**ఏదైనా సృజనాత్మక రంగంలో లోతుగా కృషి చేసినప్పుడు అడపాదడపా కొన్ని ప్రశంసలు, అభినందనలు, అవార్డులు, రివార్డులు రావడం, బాధ్యతని మరింత పెంచి, ఇంకా గట్టి కృషి చేయడానికి బాగా దోహద పడతాయి.**

**ఓ కార్టూనిస్టుగా, దర్శక రచయితగా, ప్రచురణకర్తగా ఎన్నో అవార్డులు రివార్డులు శంకుగారు పొందినా... కార్టూనిస్టులకు ఆయన చేసింది ఒక్కసారి గుర్తు చేసుకుంటే మాత్రం మనసు పులకరిస్తుంది.**

1976లో ఖమ్మంలో తెలుగు కార్టూనిస్టుల సమావేశం ఏర్పాటు చేశారు. దేశంలో మరెక్కడా అలాంటి సభ జరగ లేదు. అంతమంది కార్టూనిస్టులు హాజరయిన సభ కూడా ఎక్కడ నమోదు కాలేదు. దీని వెనుక ఉన్న ఒకే ఒక వ్యక్తి శంకుగారు.

ఆయన కార్యదీక్షకు, సంకల్ప బలానికి సాక్ష్యం కార్టూనిస్టుల సంఘం.

ప్రపంచ హాస్యమహాసభ 1983లో హైదరాబాదులో జరిగింది. ఆ సభలో మున్నెన్నడూ కనని రీతిని కార్టూనిస్టులకు ప్రప్రథమంగా పెద్దపీట వేయడం జరిగింది. అందుకు కారకులు కూడా శంకుగారే!

1998లో 'ఎమినెంట్ కార్టూనిస్ట్ ఆఫ్ ఇండియా' అనే డాక్యుమెంటరీని దూరదర్శన్ సహకారంతో స్వయంగా రూపొందించి, మన దేశంలోని ఆణిముత్యాల్లాంటి కార్టూనిస్టుల వ్యంగ్య చిత్రకళా వైభవాన్ని ప్రపంచం నలుమూలలా చాటి చెప్పారు శంకు!

శ్రీసంపర రామచంద్రరావు-ప్రభావతి దంపతులకి ప్రథమ సంతానంగా డిసెంబరు, 16,1946న, తెనాలిలో పుట్టిన 'శంకు'కి తన తాతగారి ఊరు తణుకులో బాల్యం గడిచింది.

స్కూలు చదువు విజయనగరం, గుంటూరు, విజయవాడ, పాలకొల్లు, నెల్లూరు ఇలా వాళ్ల నాన్నగారు ఉద్యోగరీత్యా వెళ్ళిన వూళ్ళలో జరిగింది. నెల్లూరు విఆర్ కాలేజీలో పియుసిని, విజయవాడ ఆంధ్ర లయోలా కాలేజీలో బి.యస్సీని చదివి, కాకినాడకి వచ్చి అక్కడ ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ క్లాస్‌మేట్‌గా ఇద్దరూ కలిసి సిఎ చదివారు.

ఆ చదువు పూర్తయ్యాక ఇద్దరూ ఒకచోటే ఎపిఎస్ఎఫ్‌సి హైదరాబాద్‌లో పని చేశారు.

ఇరవై ఎనిమిది సంవత్సరాల సర్వీసు పూర్తయ్యాక స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన శ్రీశంకు అప్పట్నుంచీ తనకి ఆది నుంచి ఇష్టమైన మల్టీమీడియా రంగంలోనే స్థిరపడ్డారు.

హైదరాబాద్‌లో తన స్వంత ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో Animyths స్టూడియో ఏర్పాటు చేసి, అక్కణ్ణుంచే తన సృజనాత్మక కార్యకలాపాలు కొనసాగించారు.

తెలుగువారికి సుపరిచిత టెలివిజన్ న్యూస్ రీడర్ శ్రీమతి శోభాశంకర్ వీరి సహధర్మచారిణి.

2012, మే హాస్యానందం పత్రిక శంకుగారి ప్రత్యేక సంచికగా వెలువడింది. ఆయన ప్రతిభ, కార్టూన్ రంగానికి చేసిన సేవలు ఈ సంచికలో ఆవిష్కరించబడింది.

ఆయన మన మధ్య లేరన్న విషయం తెలిసి డా॥ కె.వి.రమణగారు, బ్నింగారు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఈ లెజండరీ కార్టూనిస్టు తెలుగు కార్టూన్ రంగానికి చేసిన సేవలను మరోసారి మననం చేసుకుంటూ, వారి ఆత్మకి శాంతి చేకూరాలని హాస్యానందం పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తోంది!

**శం**కుగారు చదువుకున్న బ్యాక్‌గ్రౌండ్ వున్న కార్టూనిస్ట్! ఎందుకంటున్నానంటే... ఆయన కార్టూన్‌లలో ఆయన ప్రతిభతో పాటు సంస్కారం కూడా కన్పిస్తుంది. అతి కొద్ది అరుదైన కార్టూనిస్ట్‌లలో శంకుగారు ఒకరు. **-బ్రహ్మానందం**

**నే**టి విటీ వున్న మంచి కార్టూనిస్టుల్లో శంకుగారు ఒకరు. క్రోక్విల్ సంస్థ తరపున పత్రిక వెలువరిస్తున్నప్పుడు నేను తరుచుగా ఫాలో అయ్యేవాణ్ణి. ఆ శంకు తీర్థం సేవించే వాణ్ణి. ఆయన టీ.వీ. దర్శకుడయ్యాక ముని మాణిక్యం కథలు, వంశీ కథలు, శంకులోని కళాత్మకమైన ఉత్సాహం చూసి ఫోన్ చేసి అభినందించాను. **-తనికెళ్ళ భరణి.**

**చూ**డ్డానికి చాలా సాత్వికంగా కనిపించినా, లోతైన పరిశీలన చేసి సమాజాన్ని సంస్కారించాలన్న ప్రగాఢమైన కాంక్ష కలిగిన సంస్కర్త. సంస్కారి కూడా! అతిగా మాట్లాడడు, ఆర్భాటాలకు, హంగామాలకు, హంగులకు, అతిశయోక్తులకు, పొగడ్తలకు దూరంగా వుండే సనాతన భావాలని స్వంతం చేసుకున్న నవనాగరికుడు, ఆధునికుడు. ఆయన నా స్నేహితుడు కావడం, నాకు చెప్పుకోదగ్గ స్నేహితుడు అవడం నేనెంతో ఆనందించే విషయం. **-కె.వి.రమణాచారి**

# అడ్డదారి డబ్బు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

**ఆవ్ అని పెద్దగా ఆవులించి, "ఏవిటండీ, బద్ధకంగా మొద్దునిద్ర పోతున్న దాన్ని, ఇంత పొద్దున్నే నిద్ర లేపి బేకరీకి తీసుకొచ్చారు. ఎప్పుడూ ఏ పది గంటలకో, పదిన్నరకో ఓపెన్ చేస్తాం కదా బేకరీ. ఈరోజు ఏంటి ఇలా ఏడుగంటలకే..." బుర్ర గోక్కుంటూ అడిగింది లలిత.**

"చచ్చు ప్రశ్నలు వేస్తున్నావ్... పిచ్చిగాని పట్టిందా!? ఇవాళేవిటో మర్చిపోయి తగలడ్డావా?" అడిగాడు మధు

"ఏమిటి ఇవాళ?" అని ఓ క్షణం ఆలోచించి... "ఛీ పాడు! నిశ్చితార్థం తర్వాత, మీరు వేలేంటైన్స్‌డే వంకతో... నన్ను ఓ పార్కుకి రమ్మని, నేను వద్దు వద్దంటున్నా నా చేయి పట్టుకుని, ఓ బంగారు గాజు తీసేశారు. పేకాట్లో ఓడిన డబ్బు కట్టాలని చెప్పి వెళ్ళిపోయారు. మీరలా చేయి పట్టుకున్నప్పుడు" అని ఇంకేదే చెప్పేంతలో...

"వద్దు! నువ్వింక ఆ పాడుబడిపోయిన ఆ పాడు జ్ఞాపకాలు తవ్వక. ఇవాళ ప్రేమికుల దినం అడ్డుపెట్టుకుని కొంచెం ఎక్కువ ధనం పోగేద్దామని ఇలా నిన్ను ఇలా కాస్త త్వరగా నిద్రలేపి తీసుకువచ్చాను. ముందుగా ఆ పాత మిగిలిపోయిన కేకులన్నీ తీసి వరసగా బయట పెట్టు". అన్నాడు.

"సరే, ఇంకా ఆ పని నేనే చేద్దావనుకున్నాను, ఇంతలో మీరే చెప్పారు. మొన్న ఆ కేకుల్లో ఓ కేకు తిన్న ఎలక, ఓ క్షణం గిలగిలా కొట్టుకుని,తర్వాత చిలకలా ఒక్క ఎగురు ఎగిరి, బతుకు జీవుడా అంటూ బేకరీ బయటికి లాంగ్ జంప్ చేసింది.

దాంతోపాటు మిగతా ఎలకలు కూడా, ప్రాణ భయంతో బిలబిలమంటూ బేకరీ వదిలి పారిపోయాయి. మళ్ళీ ఆ ఎలకలు మన బేకరీ గుమ్మం తొక్కకుండా, ఆ ఎలక కొరికిన కేకుని, నాలుగు ముక్కలు చేసి నాలుగు వైపులా పెట్టాను... దాంతో ఎలకలు కాదు కదా... కనీసం బొద్దింకలు కూడా రావట్లేదు!" అని ఓ కేకు తీసి డస్ట్ బిన్‌లో పడేయబోయింది.

"నో!" అని పెద్ద గావు కేక పెట్టి...

"నీ మొహం సంతకెళ్ళా!... నే బయటికి తీయమంది అందుక్కాదు... వాటికి ఎర్ర రంగులు పూసి, వాటిపై ఒక లవ్ సింబల్ తగలేసి, అందంగా డెకరేట్ చేసి, అక్కడ అద్దాల బాక్సులోకి తోసేసావంటే, వచ్చిన వాళ్ళకి అవి వాలెంటైన్స్ డే స్పెషల్ కేకులని చెప్పేసి అమ్మేయడానికి. అర్థం అయిందా?" అసహనంతో ఊగిపోతూ చెప్పాడు.


"అయ్యో అదేం పనండీ? ఈ కేకులు తింటే, ముందు దోకులు చేసుకుని,తర్వాత మందు మాకులు మింగాలి!" తెల్ల మొహం వేస్తూ అంది.

"వ్యాపారంలో పర సానుభూతి ఉండదు... డిమాండ్‌ని బట్టి డబ్బు చేసుకోవాలి. ఈ రోజుని అడ్డుపెట్టుకుని ఇలా... నాలుగు డబ్బులూ, మరో రోజుని ఆసరా చేసుకుని కొంత డబ్బు వెనకేసుకోవడమే వ్యాపారం!... వ్యాపారం అంటేనే డబ్బుపై కాపారం!" అన్నాడు తెలిగ్గా.

"పోయిన్నెల బోగీ, సంక్రాంతి టైములో కూడా మీరు అచ్చంగా ఇలాంటి చచ్చుపుచ్చు పనులే చేశారు. ఆ సమయంలో ప్యూర్ ఘీ స్వీట్స్ అని, సగం డాల్డా కలిపిన డకోటా మిఠాయిల్ని ఎక్కువ రేటుకి అమ్మేశారు. చిటికెడు పంచదార, చారెడు చాక్లీన్ వేసిన స్వీట్లపై ఎక్కువ మార్జిన్ మిగుల్చుకున్నారు. కోవాలో కొబ్బరుండ పెట్టి, కోవా రేటుకే ఆ స్వీట్లమ్మి ఎక్కువ ప్రాఫిట్ పాకెట్‌లో వేసుకున్నారు. ఇలా అనేకం చేసి అడ్డంగా బోలెడు సంపాదించారు. కానీ తర్వాతోరోజు షార్ట్ సర్క్యూట్ అయ్యి... బేకరీలో మూడవ వంతు కాలిపోయి, బేకరీ అందం పాలిపోయింది. దాంతో లాభం గూబలోకి వచ్చి, మొత్తం రిపేర్లకే సరిపోయింది". ఉసూరుమంటూ చెప్పింది.

అదంతా విన్న మధు, పళ్ళు నూరుతూ "అయితే ఇప్పుడేవంటావ్?" అడిగాడు.

"మావయ్యగారు, అదే మీ నాన్నగారు పోయి, ఈ బేకరీ మీ చేతికొచ్చి మూడు నెలలు కావొస్తోంది. ఆయన ఉన్నపుడు వారానికో మారు పది బ్రెడ్‌లని అర్ఫన్‌హోంకి పంపేవారు. నెలకోసారి, ఓ యాభై బ్రెడ్స్‌ని ఒల్డేజ్ హోంకి పంపేవారు. బేకరీ మీ చేతికొచ్చాక, సగం బ్రెడ్స్ అయినా పంపమని మిమ్మల్ని ఆ



హోంల వాళ్ళు బ్రతిమాలితే, వృద్ధాశ్రమాలకిచ్చి డబ్బు వృధా చేసుకో లేనూ...కనుక మిల్క్ బ్రెడ్ కాదుకదా, కనీసం టీ బన్ను కూడా ఇవ్వనూ, కావాలంటే కొనుక్కు తినండి అని కసురుకునీ... ఛీకొట్టి మరీ ఫోన్ పెట్టేశారు. మావయ్యగారి హయాంలో, లాభాలు తక్కువ వచ్చినా, ఆయన ముఖంలో ఎప్పుడూ ఓ తృప్తి, సంతోషం ఉండేది. కారణం, డబ్బుతో ఏం కొనగలమో కాదు, ఏం కొనలేమో ఆయనికి తెలుసు కనుక! మావయ్య ఎప్పుడూ ఓ మాట అనేవారు, అడ్డదారిన సంపాదించే డబ్బు, దొడ్డిదారిన పోతుందీ అని!" కాస్త పై స్వరంతో చెప్పిందామె.

"సరేలే... నీ రోత కూతల మోత ఎప్పుడూ ఉండేదే. ఈ పాత, రోత నమ్మకాలన్నిటికీ మూతపెట్టు. నీ పాత చాదస్తాలని పాతిపెట్టు. అవి పట్టుకు వేల్లాడితే, నేను సరిగ్గా సంపాదించేప్పటికి తాతనైపోతాను. ఏదో ఓ సారి అలా జరిగిందని, ఎప్పుడూ అలానే నష్టపోతామా? ముందా బాక్స్ అందుకో!" అన్నాడు.

"మీరు మారరు!" అని క్షణం ఆగి... "ఎక్కడో క్లియరెన్స్ సేల్‌లో తెల్ల ప్లెయిన్ టి షర్ట్స్ కొనుక్కు తెచ్చారు. వాటికి లవ్ సింబల్స్ వేసి, మంచి లాభానికి, పక్కనున్న గార్మెంట్‌షాపు వాడికి అమ్ముతా అన్నారు! అవి ఏవి?..." అంది.

"అవా! అలా లవ్ స్టిక్కర్ అంటించిన వాటిలో ఒకదాన్ని ఫోటో తీసి, నా వాట్సప్ స్టేటస్‌లో పెట్టాను. ఒకతను చూసి, ఫోన్ చేసి, నాకు అన్నీ కావాలన్నాడు. సరే అని చెప్పి ఆ పాతిక షర్టులూ, ఒకటి పదిహేను వందలకి అమ్మే సాను. ఒక షర్ట్ పై అడ్డంగా మూడు వందలు లాభం. అతను, లవ్‌సింబల్స్‌తో పాటు వాలెంటైన్స్ డే అని ప్రింటింగ్ వేసి, ఆ తర్వాత ఆన్‌లైన్లో పెట్టుకుని, బ్రాండెడ్ అని చెప్పి, ఎక్కువ ధరకు అమ్ముకుంటాడట!" చెప్పాడు.

"అబ్బో! ఈ ఒక్క రోజుకే సంవత్సరం సరిపడ



వ్యాపారం చేసేటట్టున్నారే!" అంది లలిత.

"మరేం అనుకున్నావ్?" కాలర్ ఎగరేసాడు.

ఇంతలో బేకరీ ముందో కార్ ఆగింది.

అందులోంచి దర్జాగా ఒకతను దిగొచ్చి,

"ఏవండీ, ఎల్లుండికి ఒక వెయ్యి బ్రెడ్స్ కావాలి, వీలు పడుతుందా" అడిగాడు.

"వెయ్యి బ్రెడ్సా! మీరు కేటరింగ్ కుక్కా?..." అని ఆగిపోయి... "అదే కేటరింగ్‌లో కుక్‌నా? మిమ్మల్ని చూస్తుంటే ఓనర్‌లానే ఉన్నారు. ఒకవేళ బ్రెడ్ హల్వా స్వీట్ చేయడానికైతే, నాకు ఓ అరకేజీ పొట్లం కట్టి..." అని మధు నాలుక చప్పరిస్తూ ఇంకేదో చెప్పేంతలో...

"దాని కోసం కాదు, ముందు మీ మూతి తుడుచుకోండి. సిటీలో ఉన్న ఓల్డేజ్ హోమ్స్‌కి డొనేట్ చేయడానికి." చెప్పాడు.


"అందుకా?...అయినా అన్ని బేకరీలుండగా,ఇంత పెద్ద ఆర్డర్ మాకే ఎందుకివ్వడం?" సందేహంగా అడిగాడు.

"మీ బేకరీ నుండి కూడా ఫ్రీ బ్రెడ్స్ వెళ్తుంటాయని నా ఫ్రెండొకడు నొక్కి మరీ చెప్పాడు. అందుకే ఇలా!" అన్నాడు నవ్వుతూ.

"సరే, ఎల్లుండికి కదా! ఎల్లుండి పన్నెండుకి రండి. ఇదిగోండి నా కార్డ్, సగం అడ్వాన్స్ పై నెంబర్ కి ఆన్‌లైన్లో పే చేయండి!" చెప్పాడు మధు.

సరే అని వెళ్లిపోయాడతను.

తర్వాత ఒక గంటలోనే, మంచి వ్యాపారం జరిగింది.




"ఏవండీ! చెప్పడం మర్చిపోయాను, నిన్న సాయంత్రం మీ సుపుత్రుడు ఈరోజు తన పుట్టినరోజుకి ఆన్‌లైన్లో బట్టలు ఆర్డర్ పెట్టుకుంటానూ, డబ్బులు ఫార్వర్డ్ చెయ్ మమ్మీ అంటే, సరే అన్నాను. ఏదో డ్రెస్ ఐదు వేలట. సరే అని పే చేసేశాను." చెప్పింది.

"ఐదువేలా! ఆ రోజుల్లో మా నాన్న అయితే నాకు ఒక పది రూపాయిలు చేతిలో పెట్టి, ఒక చొక్కా కొనుక్కోమనేవాడు. ఏంటో ఈ కాలం పిల్లలు, నల్లుల్లా పీకేసి, తల్లిదండ్రులకి ఆర్థికంగా ఎన్నో చిల్లులు పెట్టేస్తున్నారు..." అంటుండగానే...

"ఏవండీ!" గట్టిగా అరిచింది లలిత

"ఏమైందీ?! ఎలకేమైనా కాలి వేలు గానీ కరిచిందా?" అడిగాడు మధు.


"కాదండీ! ఇందాక వెయ్యి బ్రెడ్స్ ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి కేన్సల్ చేయమని... మెసేజ్ పెట్టాడు. మన బేకరీ నుండి ఓల్డేజ్ హోంకి ఎటువంటి బ్రెడ్సూ గత మూడు నెలల నుండీ పంపక పోగా... వృద్ధాశ్రమానికివ్వడం వృథా ఖర్చన్నారని, ఆ ఆశ్రమం వాళ్ళు ఆగ్రహంగా చెప్పడంతో... శీఘ్రంగా ఈ నిర్ణయం తీసుకున్నానని మెసేజ్ పెట్టాడు." చెప్పింది డీలా పడిపోతూ.

"అలాగా! పెద్ద అడ్వాన్స్ వేస్తాడనుకుని, మనసులోనే బోల్డంత డాన్స్ చేసేశాను. అడ్డం తిరిగి కేన్సల్ చేయమన్నాడు... ఛ! " అని అనుకుంటుండగానే...

కొడుకు బబ్లు ఎదురుగా నడిచి రావడం చూసి...

మరింత షాక్‌తో కప్పలా నోరెళ్ళ బెట్టాడు. కారణం, తను పదిహేనువందలకి అమ్మిన అదే టీ షర్ట్ ని, ఆన్‌లైన్లో తన కొడుకు ఐదు వేలకి కొని వేసుకోవడమే... అతని షాక్‌కి కారణం.

అది చూసిన లలిత– టప,టపా నెత్తి కొట్టుకుని... "సరిపోయింది యవ్వారం! మీరు అడ్డంగా సంపాదించిన లాభం అంతా, మీ కొడుకు నిలువునా ముంచేశాడు. ఇలాంటి అడ్డదారి డబ్బు, దొడ్డి దారిన పోతుందని ఇప్పుడైనా మీరు గ్రహించాలి!" చెప్పడంతో ఆలోచనలో పడ్డాడు మధు.



# “నా కార్టూనుకి బహుమతి ఎందుకు రాలేదు?”

‘నేను చాలా బాగా కార్టూన్లు గీస్తున్నాను...పాతిక సంవత్సరాలకు పైగా గీస్తున్నాను. నా కార్టూన్‌కి బహుమతి ఎందుకు రాలేదు?’... ఇది చాలామంది కార్టూనిస్టులను వేధించే ప్రశ్న. ఈ రోజు ప్రకటించిన కార్టూన్ల పోటీ ఫలితాలలో ప్రథమ బహుమతి పొందిన కార్టూను కంటే నా కార్టూన్ ఎంతో బావుంది అని చాలామంది మనసులో అను కుంటే కొంతమంది పోటీలో బహుమతి పొందని ఇంకో కార్టూనిస్టుతో తన బాధ పంచుకుంటాడు... ఇంకొకరు మరికొంత ముందుకు వచ్చి ఆ పోటీ నిర్వాహకులకే ఫోన్ చేసి నిలదీస్తున్నారు.

వీళ్లే కాదు 1960ల్లో శ్రీయుతులు బాపూ, సత్యమూర్తి, చంద్ర, జయదేవ్, బాలి, రామకృష్ణ, కాటూరి, శంకు లాంటి వారిని కూడా ఆ ప్రశ్న తలెత్తే వుంటుందని నా ప్రగాఢ విశ్వాసం... కానీ వారు వాళ్ల మనసులో అను కున్నారేమో గానీ ఎప్పుడూ ఎవరినీ నిలదీసిన దాఖ లాలు లేవు.



కానీ ఒక కార్టూనిస్టుగా మన పరిమితులు గమ నించి హుందాగా వ్యవహ రిస్తే బావుంటుంది కదూ! అదే విధముగా నిర్వాహ కుల మరియు న్యాయనిర్ణేతలకు కూడా వారి వారి పరిధులు వారి కుంటాయి కదా! నిర్వాహకులకుండే కష్టాలు ప్రకటన యిచ్చిన రోజు నుండి మొదలయితే న్యాయనిర్ణేతలకు ఆ రెండు రోజులు నరకం కనబడుతుంది. పోటీలో కార్టూన్ల ఎంపికకు చాలా parameters పరిగణలోకి తీసుకోవలసి వుంటుంది. కార్టూనిస్టు మరియు ఔత్సాహిక కార్టూనిస్టు, ప్రాంతము, పురుష మరియు మహిళా కార్టూనిస్టు, భాషా ప్రాధాన్యత, కార్టూన్ల బొమ్మల పొందిక, కాప్షన్ రాసే విధానము, హాస్యము, సునిశిత హాస్యము, చూడగానే చురుక్కుమనే చమత్కారము... ఇలా అనేకమైన అంశాలు పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలైతే, న్యాయనిర్ణేతల్లో ఏకభిప్రాయం ఓ పట్టాన రాదు. ఎందుకంటే న్యాయ నిర్ణేతలు కనీసం ముగ్గురు నలుగురుంటారు కదా! ఒకరికి ఒక కార్టూన్ నచ్చితే ఇంకొకరికి అది నచ్చదు. ఏకాభిప్రాయానికి రావడమనేది చాలా క్లిష్టమైన పని. ఏదో కష్టపడి ఓసారి ప్రథమ బహుమతి ప్రకటించి బహుమతి ప్రదానం చేసిన మరుసటి రోజునే తెలిసిన విషయమేమి టంటే అది పక్కా కాపీ కార్టూన్ అని మక్కీకి మక్కీ ఆ కార్టూన్ ఒక ఇంగ్లీషు కార్టూన్ అని తేలిపోతే, ప్రథమ బహుమతి ప్రకటించిన ఆ న్యాయనిర్ణేత 60 యేండ్లుగా కార్టూన్లు గీస్తున్న ఆ సీనియర్ కార్టూనిస్టు బాధ వర్ణనాతీతం.

ఆయనేమన్నారంటే నేను నా జీవితంలో యింకెప్పుడూ న్యాయ నిర్ణేతగా వ్యవహరించనని ఒట్టు పెట్టుకున్నారు.

మనం ఎన్నో కార్టూన్లు ప్రతి రోజూ గీస్తుంటాము వాటిలో ఎన్నో కార్టూన్లు బహుమతి పొందిన కార్టూన్ల కంటే గొప్పగా వుంటాయి. యిది నిజం కాదా?

అలాగే ఒక కార్టూను తొమ్మిది పత్రికల నుండి తిరిగి వస్తే పదో పత్రిక ఆ కార్టూనుకి ప్రథమ బహుమతి ప్రకటించింది. అది ఎవరి కార్టూనో కాదు... సుభానీ కార్టూను అది. ఆయనకు 1980ల్లో జరిగింది. అది కూడా దీపావళికి గీసిన కార్టూను.

‘మనం ఎన్నో అనుకుంటాం... అవన్నీ జరుగుతాయా ఏంటీ?’ అనే బాలకృష్ణ సినిమా డైలాగు మనకు బాగా వర్తిస్తుంది. బహుమతి రానందువలన నువ్వు మంచి కార్టూనిస్టు కాదని... కాదన్న విషయం కార్టూనిస్టు గమనించాలి. ఒక కార్టూను బహుమతి పొంద డానికి పొందకపోవడానికి చాలా కారణాలు వుంటాయి.

కార్టూనిస్టులకు, పోటీ నిర్వాహకులకు మరియు న్యాయ నిర్ణేతలకు మధ్య వున్నది ఎప్పటికీ అవినాభావ సంబంధమే.

నిర్వాహకులకు ఇంకో నిరుత్సాహం ఏమిటంటే...

వారు అంత కష్టపడి డబ్బులు ఖర్చు పెట్టి ఒక పోటీ నిర్వహించి సభ ఏర్పాటు చేస్తే సగం మంది పోటీ విజేతలు... ఒక్కోసారి ప్రథమ బహుమతి పొందిన కార్టూనిస్టు కూడా డుమ్మా కొడుతున్నారు.

అదీగాక బహుమతి సొమ్ము ఫోన్ పే ద్వారా, మెమెంటోలు సర్టిఫికెట్లు పోస్టు ద్వారా పంపమని అడుగుతున్నారు.

ఈ సందర్భంలో పోటీ నిర్వాహకుల మనోభావన ఏ విధంగా వుంటుందో ఊహించండి.

మరి ఈ పరిస్థితులలో నిర్వాహకులు ముందు ముందు కార్టూన్ల పోటీలు నిర్వహించగలుగుతారా?

ఈ కార్టూను పోటీలు నిర్వహిస్తున్నది వారి కోసమా లేక కార్టూనిస్టుల కోసమా అనేది ప్రతి కార్టూనిస్టు ఒక్కసారి ఆలోచించాలి

**–బాచి, కార్టూనిస్టు**

# సీజన్ మామయ్య - చిన్నారి పెళ్ళికొడుకు

డా॥రామలక్ష్మి, తాడేపల్లి, +971 50 657 3287

**మీకో విచిత్రం చెప్పనా... ఇవ్వాళ మా బుజ్జి అన్నయ్య ఫోన్ చేశాడు... చెప్పింది సుజాత.**

**ఎవరూ మీ సీజన్ అన్నయ్యా. ఆయన ఫోన్ చేశాడంటే అది విచిత్రమే కాదు, విడ్డూరం కూడా! తుఫాన్లు వస్తాయో, ఏకంగా సునామీ లే వస్తాయో అన్నాడు ప్రకాష్.**

**హహహ! సీజన్ అన్నయ్యా... భలే పేరు పెట్టారే! పగలబడి నవ్వింది సుజాత.**


"నేను పెట్టడం ఏంటి!... మీరంతా అను కుంటూ ఉంటారుగా ఆయన సీజన్ ఎలా ఉందో ఇప్పుడు అనీ!"

"నిజమే, మేము ఆయన మానసిక వాతా వరణం ఎలా ఉందో అని అనుకుంటుంటే మీరు ఏకంగా తన పేరే సీజన్ అన్నయ్య అని పెట్టేసారు. భలే పేరు!...అవునండోయి! వాళ్ళ ఇంటికెళ్తేనే సరిగా మాట్లాడని ఆయన గారు ప్రత్యేకం తనంతట తానే ఫోన్ చేశాడంటే మీరన్నట్లు తుఫానే వస్తుందో లేక మీరు ఆయ నకు పెట్టిన పేరుకు తగ్గట్లు సీజనల్‌గా మంచు తుఫాన్లో వడగాల్పులో కూడా రావచ్చేమో!"

"ఇంతకీ మీ సీజన్ అన్నయ్య ఫోన్ ఎందుకు చేశాడో చెప్పలేదు... ఏంటిటా సంగతి?"

"ఏమో! ఫోన్ చెయ్యడం వరకు చేశాడు గానీ సరిగ్గా మాట్లాడితే కదా?...'హలో, నేను, బుజ్జినీ' అన్నాడు అంతే! ఆ తరవాత బాగు న్నావా అన్నయ్యా దగ్గర్నుంచి... ఉంటాను అన్నయ్యా వరకూ నేను మాట్లాడడమే... నేను అడిగిన వాటికి ఊ, ఆ అని ఏకాక్షర శబ్దాలు చేశాడు అంతే. కొన్నిటికి అయితే ఆ శబ్దాలు కూడా లేవు. అసలు లైన్లో ఉన్నాడో ఫోన్ పెట్టే శాడో తెలియక దేభ్యం మొహంలా ఫోన్ స్క్రీన్ చూసుకోవాల్సి వచ్చింది మధ్యలో!" అని తల కొట్టుకుంది సుజాత.

"ఈసారి మీ సీజన్ అన్నయ్యకు నెంబర్ డయల్ చేసాక నువ్వు ఫోన్ ఎత్తే లోపే సీజన్ మారి మాట్లాడే మూడ్ పోయిందేమో.




భలే వాడే!" అన్నాడు ప్రకాష్.

ఆ తర్వాత వారం రోజుల పాటు, సుజాత, తన కజిన్ అక్క చెల్లెళ్లు నలుగురి ఫోన్లు ఒకరినుండి ఒకరికి మ్రోగుతూనే ఉన్నాయి. ఎందుకంటే వాళ్ళు నలుగురికీ, వాళ్ళ అన్న దమ్ములు ఇద్దరికీ కూడా బుజ్జి అన్నయ్య ఫోన్ చేశాడు.

పెదనాన్నను చూడటం కోసం వాళ్ళ ఇంటి కెళ్ళినా, పరాయి ఖండపు అపరిచిత వ్యక్తులను చూసినట్లు మొహం తిప్పుకునే బుజ్జన్నయ్య తనంతట తానుగా ఫోన్ ఎందుకు చేశాడు అనేది వాళ్ళందరికీ బెర్ముడా ట్రయాంగిల్ రహస్యం లాగా అంతు చిక్కలేదు.

"నీకూ చేశాడా!" అంటే "నీకూ చేశాడా?" అని వాళ్ళంతా విడి విడిగా మాట్లాడుకుని ఆ తర్వాత ఇంకా ఆశ్చర్యం తీరక అందరూ కాన్ఫరెన్స్ కాల్ చేసుకుని మరీ సంఘటితంగా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు.

ముగ్గురు అన్నదమ్ముల సంతానం వీళ్లం దరూ.బుజ్జి అందరి కంటే పెద్దాయన కొడుకు. తనకో స్వంత అక్క! సుజాత రెండవ ఆయన కూతురు, తనకో చెల్లి. మూడవ ఆయనకు పుట్టిన ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి, సునీత వాళ్ళు, వీళ్ళు ఐదుగురూ దగ్గర దగ్గర వయసు వాళ్లవ్వడంతో చిన్నప్పటి నుండి స్నేహంగా, చనువుగా ఉంటారు.

అందుకే వాళ్ళ ఐదుగురి మధ్య ఆ ఆశ్చర్యార్థక ఫోన్ కాల్స్ ఒకసారి కాదు రెండు సార్లు కాదు, ఓ వారం పాటు జరిగాయి... జరగవు మరీ, చెప్తే నమ్మరు కానీ బుజ్జి అలాంటి వాడే! చిన్నప్పటి నుంచీ ఎవరితో కలవకుండా తేడాగానే ప్రవర్తించేవాడు... ఎప్పుడో ఒకసారి తనకు అవసరం ఉన్నప్పుడు మాత్రం మాట్లాడేవాడు. అదే పండుగ అందరికీ! పాపం అందరి కన్నా పెద్ద అన్నయ్య అనీ, తమ ప్రియతమ పెద్ద పెదనాన్న కొడుకనీ వదులుకోలేక, ఆ అన్నదమ్ముల పిల్లలంతా...

"ఏదోలే తన మూడ్ బాలేదు. ఇప్పుడు మాట్లాడే సీజన్ కాదు, అన్ సీజన్!" అని అదో నవ్వులాటగా చేసి తమకు తాము సరిపెట్టు కున్నారు కానీ బుజ్జి మూడ్ నూటికి తొంభై తొమ్మిదిసార్లూ బాగోదు కనుక అతను మాట్లా

డడానికి దాదాపు అన్ సీజనే. తను ఎవరి ఇంటికి వెళ్ళడు, ఎవరైనా తమ ఇంటికి వచ్చినా తను మాట్లాడించక పోగా వాళ్లకు తనను మాట్లాడిచ్చే అవకాశం కూడా ఇవ్వకుండా చరచరా మొహం తిప్పుకు వెళ్ళిపోతాడు. అందుకే ఉన్నట్లుండి తనంతట తానుగా బుజ్జన్నయ్య అందరికీ ఫోన్ చేయటం గురించి అంత చర్చ!

సరే, ఒకవారం పాటు అందరూ బుజ్జన్నయ్య ఫోన్ గురించి మాట్లాడుకుని అలసిపోయాక మరుసటి వారంలో రోజుకొకరికి చొప్పున మళ్ళీ బుజ్జి నుండి ఫోన్‌లు వచ్చాయి. ఫోన్ చేస్తాడు... ఏమీ మాట్లాడడు. మౌనం పాలే ఎక్కువ విషయం అసలుకే ఉండదు. మళ్ళీ అందరూ ఫోన్లలో తమ జుట్టు తామే పీక్కున్నారు.

ఈ తతంగం అంతా చూస్తున్న ప్రకాష్ ఓ రోజు విసుగు పుట్టి–

"అబ్బా! ఆయన ఫోన్ చెయ్యటం, మీరేదో పెద్ద బ్రహ్మ రహస్యం కనుక్కోవాలి అన్నట్లు ఆపకుండా ఆన్లైన్ మీటింగ్లు పెట్టడం, విసుగు పుడుతోంది. అంత విశ్లేషించటానికి ఏముంది? మీ బుజ్జన్నయ్య పిల్లలు పెద్దవాళ్ళయ్యారుగా! వాళ్ళకీ పెళ్ళిళ్ళు చెయ్యాలిగా... ఇప్పటి దాకా పొట్లచెట్టుకు పొరుగు గిట్టదన్నట్లు ఎవరితో కలవకుండా ఉన్నాడు... ఇప్పుడు నలుగురితో మంచిగా ఉండకపోతే పిల్లలకి మంచి సంబంధాలు రావని అందరితో కలవాలని ప్రయత్నిస్తూ ఉంటాడులే" అని తేల్చేశాడు ప్రకాష్.

ప్రకాశ్ మాటలకు– "నిజమే! అంతే అయ్యుంటుంది." అనుకున్నారు అందరూ.


అయితే కథ అక్కడితో ఆగితే కమామీషు ఏముంటుంది? ఆ తర్వాత నెలలో పెద్ద మలుపు తిరిగింది.

ఓ నెల పాటు పచారీ కొట్టు సామాన్ల లిస్ట్‌లో ఒక్కొక్కదానికీ టిక్కులు పెట్టుకు పోయినట్లు, ప్రతివారం తన తమ్ముళ్ళు చెల్లెళ్ళకు వరసగా ఫోన్ చేసిన బుజ్జి రెండో నెల నుంచి మిగిలిన వాళ్లకు తగ్గించి సుజాతకు మాత్రం ఫోన్ల డోస్ పెంచాడు.

ఆ అంశం మీద మళ్ళీ సర్వ సభ్య సమావేశం చేసిన సుజాతా వాళ్ళ కమిటీ సభ్యులకు ఒక అనుమానం వచ్చింది, కొంపదీసి బుజ్జన్నయ్య తన కూతురిని సుజాత కొడుకు ధీరజ్‌కి సంబంధం అడుగుదామని అనుకుంటున్నాడా అని!

ఆ అనుమానం రాగానే అందరూ ఆ ఆలోచనను ఖండించి, ఆ ఊహకే ఖేదం వ్యక్తం చేసి... సుజాతకు ముందస్తు సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.

"వామ్మో! ఇంకేమైనా ఉందా? ఆ ఇంట్లో వాళ్ళు వాళ్ళ కొంపకెళ్తే సరిగ్గా మంచి నీళ్ళు కూడా మొహాన పొయ్యరు! అలాంటి పెంపకంలో పెరిగిన పిల్లని చేసుకుంటే ఇక నువ్వు... బావగారు కాశీకి పోవాల్సిందే!" అని అందరూ వాపోయారు.



అసలే తన కొడుకు ఈ ప్రపంచోత్తమ బ్రహ్మచారి అదే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ అని భావించే సుజాత– "ఎందుకులే తల్లీ! అల్లారు ముద్దుగా పెంచుకున్న నా చిన్నారి కొడుకు వాడు!... అభం శుభం తెలియని అమాయకుడు. ఉన్న ఒక్కగానొక్క పిల్లాడికి అలాంటి సంబంధం వద్దు! అంతదాకా వచ్చి అన్నయ్య సంబంధం అడిగితే ఏదో ఒక వంక చెప్పి ఎగర గొట్టేస్తాలే!" అంది.


పోనీ కథ ఇక్కడితో ఆగినా బాగుండేది. కానీ ఈ కథకి ఘాట్‌రోడ్డులోలా ఓ హెయిర్ పిన్ కర్వ్ వచ్చింది.

ఆ తర్వాత కొద్ది రోజులకే సీజన్ అన్నయ్య నుండి ఒక ఆకస్మిక, అనూహ్య, ఆశ్చర్యకర ఫోన్‌కాల్ వచ్చింది. దాని సారాంశం ఏమి టంటే బుజ్జి తన భార్యా బిడ్డా సమేతంగా మరీ సుజాత వాళ్ళ ఇంటికి వస్తున్నట్లు. ఆ హఠాత్ సంఘటనకు ఏమీ తోచలేదు సుజాత వాళ్ళకు.

"ఇంకేముంది?.. సంబంధం అడగటానికే వస్తున్నాడు. అందుకే అందరినీ తీసుకు వస్తు న్నాడు!" అనుకుని ఎలా కాదనాలో ఏమి కార ణాలు చెప్పాలో తెగ రిహార్సల్స్ వేసుకుంది సుజాత.

కానీ బుజ్జన్నయ్య వాళ్ళని చూడగానే ఒక్క మాట రాకుండా సిరివెన్నెల సినిమాలో సుహా సినిలా అయిపోయింది సుజాత పరిస్థితి.

దానికి కారణం బుజ్జన్నయ్య కూతురు అక్షయ. ఎన్నాళ్ల తర్వాతో చూసారేమో... ఆ అమ్మాయి అందం చూడటానికి రెండు కళ్ళూ చాలలేదు సుజాత వాళ్లకు. ముఖం చూస్తే ముద్ద మందారంలా, కళ్ళను చూస్తే కలువ రేకుల్లా, వంటి తీరు చూస్తే సన్నజాజి పువ్వులా మొత్తానికి ఓ నడిచే పూల బుట్టలా సుజాతను విస్మయ పరిచింది అక్షయ... ఇంక ధీరజ్ సంగతి చెప్పక్కర్లేదు. వాడికైతే ఆ పిల్ల మన సున్న మిఠాయి పొట్లంలా అనిపించిందేమో! వాళ్ళున్నంత సేపు మతిభ్రమించిన ఈగలాగా అక్కడక్కడే తిరిగాడు.




బుజ్జి బోలెడన్ని కబుర్లు చెప్పాడు, తెగ జోకులు వేశాడు. అత్తయ్య వాళ్లకు పాట పాడి వినిపించమ్మా అని అక్షయతో పాట పాడిం చాడు బుజ్జి. వెళ్ళేటప్పుడు అత్తయ్య మామయ్య కాళ్ళకు దణ్ణం పెట్టమని పెట్టించాడు. ఆ పిల్ల కూడా ఎంతో ముచ్చటగా చెప్పినవన్నీ చేసింది.


పెళ్ళి సంబంధం మాట మాత్రం ఏమీ ఎత్త లేదు. హఠాత్తుగా ఆ ఊరి వేంకటేశ్వర స్వామి గుడిలో ఎప్పుడో మొక్కుకున్న మొక్కు గుర్తొచ్చిందనీ అందుకే దర్శనం కోసం వచ్చా మని చెప్పాడు. అలా ఒక పూట అంతా హడా విడి చేసి వెళ్ళాక వాళ్ళు అటు వెళ్ళీ వెళ్ళక ముందే ధీరజ్ బుజ్జీ వాళ్ళని, ముఖ్యంగా అక్ష యనూ పొగడటం మొదలు పెట్టాడు.


"మీరంతా అంత మంచి వాళ్ళ మీద అనవ సరంగా చెడు అభిప్రాయం పెట్టుకున్నారేమో?" అని అనుమానం వ్యక్తం చేసాడు. అక్షయను కోడలిగా తెచ్చుకోవటం ఎన్ని రకాలుగా ఆ ఇంటికి మంచిదో వర్ణించాడు.

మొత్తానికి అబ్బాయి అక్షయ అందానికి బొక్కబోర్లా పడ్డాడని అర్థమైంది సుజాతకు.

ధీరజ్ ఎంత మంచి ఉద్యోగం చేస్తున్నా, ఎంత ఆస్తి పరుడు, కళ గల ముఖం అయినా పిల్లాడు ఓ గుప్పెడు ఎత్తు తక్కువ ఉండటం, వాళ్ళ గోత్రం వాళ్ళే ఎక్కువ ఉండి, సగోత్రీకు లన్న కారణంతో మంచి సంబంధాలన్నీ తప్పిపోవడం...ఈ రెండు కారణాలతో ధీరజ్‌కి సంబంధం వెతకటం తను అనుకున్నంత సులభం కాదని సుజాతకు ఈ మధ్యే అర్థమ య్యింది.

అందుకే అన్నీ కుదిరిన కుందనపు బొమ్మ






లాంటి అక్షయను వదులుకోవడానికి మన సొప్పు లేదు! ఉట్టి మీద వెన్న పెట్టుకుని నెయ్యి కోసం ఊరంతా దేవులాడినట్లు అనవసరంగా ఎక్కడెక్కడి సంబంధాలో వెతికాం ఇన్నాళ్ళూ అనుకుంది సుజాత.

ఇక ఆ తర్వాత జరిగిన తమ కజిన్ల శిఖ రాగ్ర సమావేశంలో– "బుజ్జన్నయ్య మారి పోయాడ" ని అందరికీ నచ్చ జెప్పింది సుజాత!

"ఒకవేళ ఆ ఇంట్లో పెంపకం సరిగా లేక పోయినా తన ఇంటికి వచ్చాక అక్షయకు మంచీ చెడూ నేర్పి తమ ఇంటి పద్ధతులు తనే అలవాటు చేసుకోగలను" అంది. మొత్తా నికి కిందా మీదా పడి అన్నయ్యతో సంబంధం కలుపుకోవడానికి అక్కచెల్లెళ్ళు అందరితో ఔను అనిపించుకుంది.

కానీ బుజ్జన్నయ్య నుండి ఏ చడీ చప్పుడు లేకపోవటంతో ఒక చెల్లెలితో– "ధీరజ్‌కి సంబంధాలు చూస్తున్నారు... నీకేమైనా ఉద్దే శాలు ఉంటే అక్షయ కోసం అడగమని అన్యాప దేశంగా చెప్పించింది."

అలా చేసినా కూడా ఆ తర్వాత రెండు నెలలయినా బుజ్జన్నయ్య నుండి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. పైగా అంతకు ముందు వచ్చే ఫోన్లు కూడా ఆగిపోయాయి.

ఇంట్లో ఓ పక్క తన కొడుకు ధీరజ్ గోల ఎక్కువైపోయింది సుజాతకు.

త్వరగా సంబంధం కుదర్చమని... పీక్కు తినటం. దేవుడా! చిన్నప్పుడు చాక్లెట్‌లు ఐస్ క్రీమ్‌లు కొనమని కూడా ఇంత పేచీ పెట్ట లేదు. ఇప్పుడీ వయసులో అక్షయ కోసం చిన్న పిల్లల్లా మంకు చేస్తున్నాడు ఈ చిన్నారి పెళ్ళి కొడుకు అనుకుంది సుజాత.

ఇక ఆ గోల తట్టుకోలేక ఒక రోజు "మనమే వెళ్ళి సంబంధం అడుగుదా"మని తీర్మానిం చింది.

"అదేంటి సుజాతా! సంప్రదాయం ప్రకారం అమ్మాయి తరపు వాళ్ళే ముందు అడగాలిగా?" అన్నాడు ప్రకాష్.

"ఆఁ! సంప్రదాయం లేదు... సాంబారన్నం లేదు! సమయం సందర్భాల బట్టే సంప్రదా యాలు. మనసు ఉన్నా ముందడుగు వెయ్యటా నికి మొహమాట పడుతున్నాడు మా అన్నయ్య. అంది సుజాత.

ఓ శుభముహూర్తాన ఉన్న నగలన్నీ అలం కరించుకుని, ఆపసోపాలు పడుతూనే బరువైన పట్టుచీర కట్టుకుని, కావల్సినన్ని హంగులు ప్రదర్శిస్తూ సంబంధం మాట్లాడడానికి ప్రకాష్, ధీరజ్‌లతో కలిసి బుజ్జి వాళ్ళ ఇంటికి బయలు దేరింది సుజాత.

ఇక ధీరజ్ హడావిడి అయితే చెప్పక్కర్లేదు. తలనుండి కాళ్ళ వరకూ రక రకాల వేసుకు నేవి, పూసుకునేవి, పోసుకునేవి కొనుక్కుని మరీ ఆ రోజు కోసం తయారయ్యాడు.


మొత్తానికి సుజాత, ప్రకాష్ తమ కారులో, ధీరజ్ మాత్రం ఊహల పల్లకిలో ఎక్కి బుజ్జి వాళ్ళింటికి చేరారు.

✦✦✦

తలుపు తియ్యంగానే ఎదురుగానే ఉన్న బుజ్జన్నయ్య సుజాతా వాళ్ళ వైపు చిరాకుగా ఓ చూపు విసిరి గిరుక్కున లోపలికి వెళ్ళి పోయాడు అచ్చు అదివరకులా. ఆయన భార్య కూర్చోడానికి కుర్చీ చూపించినా ఏమీ మాట్లా డకుండా ఎటో చూస్తూ నిలబడి మీరు వెళితే నేను తలుపేసుకుంటా అన్నట్లుగా... బాడీ లాంగ్వేజ్ ప్రదర్శిస్తోంది.

"'ఈదబోతే తాగ నీళ్ళు లేవనన్నట్లు' సంబం ధం అడుగుదామని వస్తే వీళ్ళు సరిగ్గా మాట్లా డను కూడా మాట్లాడడం లేదేంటని" ప్రకాష్, సుజాత మొహమొహాలు చూసుకున్నారు.

ఓ పక్క సుజాత పరిస్థితి పెనం పై పరచిన



దోశలా అట్టుడుకుతున్నా ఏదో ఒక మాట కలపాలని "పిల్లలు లేరా? అక్షయ ఏది?" అని అడిగింది.

"అదా! లోపల పడుకుంది సుజాతా, మొన్న మీ ఇంటికి వచ్చినప్పటినుండి తనకు ఆ వాతావరణం పడక ఒకటే ఎలర్జీ.

"ఇంకెప్పుడూ ఆ పల్లెటూరి మాట ఎత్తకండి, ఆ పల్లెటూరి వాళ్ళ ఇళ్ళకి తీసుకెళ్ళకండి!" అని తేల్చి చెప్పేసింది" అంటూ నర్మగర్భంగా నవ్వింది లలిత.

తను అడగాలనుకున్న విషయం ముందే గ్రహించి ఆ మాట చెప్పింది వదిన అని గ్రహించింది సుజాత. అవి పిల్ల మాటలు కావు తల్లి దండ్రుల అభిప్రాయాలే అని వదిన హావభావాలు చెప్పకనే చెబుతున్నాయి.


"మొన్న మన ఇంటికి వచ్చి అంత ప్రేమగా గడిపి వెళ్లింది వీళ్లేనా అసలు?!" అని దిగ్భ్రాంతికి లోనయ్యారు ముగ్గురూ.

అప్పుడే అక్షయతో కలిసి పెళ్ళి పల్లకి ఎక్కి ఊహా విహారం చేస్తున్న ధీరజ్ అయితే.... దేభ్యం మొహం పెట్టాడు.

బయల్దేరిన కొంచెం సేపటికి వీళ్ళ మొహాల్లోలాగే జీవం పోయి నీరసపడ్డ కార్‌ను పెట్రోల్ బంక్‌కు తీసుకెళ్తే అక్కడ బుజ్జన్నయ్య వాళ్ళ మేనమామ కొడుకు మహేష్ కనబడ్డాడు.


కుశల ప్రశ్నలు అయ్యాక బుజ్జి సంగతి ఏంటో తెలుసుకుని పజిల్ సాల్వ్ చేద్దామని–

"ఏంటో... ఈ మధ్య మీ బుజ్జి బావ



అందరితో తెగ కలిసిపోతున్నట్లు ఉన్నాడు" అన్నాడు ప్రకాష్.

"కలిసిపోవటమా నా పిండాకూడా! అదేం లేదు. ఆయనగారికి తనెక్కడ్నించో ప్రత్యేకంగా ఊడిపడ్డట్లు , మనమంతా తనతో మాట్లాడడానికి కూడా పనికి రానని ఫీలింగ్ కదా చిన్నప్పట్నుంచి! వాళ్ళ బావమరిది ఒక్కడితో తప్ప ఎవరితో మాట్లాడడుగా... అదైనా ఆ బావ మరిది ఈయన గారికి ఆస్థులేవో తవ్వి తల కెత్తుతాడని ఆశతోనేలే! ఎంత అణచుకున్నా లోపలున్న సహజ తిక్క ఎప్పుడొకప్పుడు తోక తొక్కిన కుక్కలా లేవకపోదుగా. మొన్నీ మధ్య ఆ బావ మరిదితో కూడా మిగిలిన వాళ్లతోలానే ప్రవర్తిస్తే ఇద్దరికీ చెడి మాటా మాటా అను



కున్నారట. ఆ కోపంలో ఆ బావమరిది–

"నువ్విలాంటి వాడివి కనుకే నీ బంధువులు ఎవ్వరూ నీ మొహం చూడరు, మా అక్కయ్యని ఇచ్చాం కనుక నా ఖర్మ కాలి ఇన్నాళ్ళూ నేనయినా మాట్లాడాను. నీ మూలాన అత్తింటి వైపు నుండి మాట్లాడించే దిక్కు లేదు మా అక్కకి!" అని తిట్టి పోసి, తనూ బుజ్జి బావతో మాట్లాడడం మానేశాడట.

ఆ ఉక్రోషంతోనే ఈయనగారు తనకూ బంధువులు ఉన్నారని ఆ బావమరిదికి చూపించుకోవటం కోసం ఇటు మా వైపూ అటు మీ వైపూ అందరి వెంటా పడ్డాడు.

అందరికీ ఫోన్ చేసి, మాట కలిపి, మంచిగా మాట్లాడిన వారి ఇళ్ళకు సపరివార సమేతంగా వెళ్ళి, ఫోటోలు తీసుకొని వాటిని వాట్సప్ స్టేటస్లుగా పెట్టి– "చూసావా నాకు ఎంత మంది బంధువులు ఉన్నారో?" అని తన బావ మరిదికి చూపించుకున్నాడు.

అలా ఇటు అమ్మ వైపు చుట్టాలని... అటు నాన్న వైపు వాళ్ళనీ ఒకేసారి ఓ పట్టు పట్టాడన్న మాట మా బుజ్జి బావ.

ఇప్పుడు ఆ బావమరిది, తనూ మళ్ళీ కలిసి పోయారట! అందుకే మళ్ళీ ఇక మన మొహం చూడటం మానేశాడు!" అన్నాడు మహేష్.

"ఏంటీ!... నీకూ అయ్యిందా ఆ సత్కారం!" నీరసంగా అడిగింది సుజాత.

"ఏదో ఆయన మారాడనుకున్నాం కానీ అంతా మన భ్రమ. కాకి పుట్టీ నలుపే పెరిగీ


నలుపే అన్నట్లు ఆయన మారడు. ఏదో, ఏ లోకాన ఉందో మా అత్తయ్య, నా కొడుకుని పలకరించే దిక్కు కూడా లేదని... ఆవిడ ఆత్మ క్షోభించకూడదని ఈయన్ని మేమంతా భరి స్తున్నాం అంతే! ఏదేమైనా మా బావ తలపెట్టిన 'అయిన వాళ్ళని పట్టు–సెల్ఫీ కొట్టు, స్టేటస్ పెట్టు–బామ్మర్దికి చూపెట్టు.' అనబడే యజ్ఞం లో మనందరం సమిధలము కాబడ్డామన్న మాట." అని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు మహేష్.

"హ్మ్! ఇంత ఘోరంగా మనుషులను తన స్వార్థం కోసం వాడుకుంటాడా? మనుషుల మనసులు– అనుబంధాలకు విలువే ఇవ్వడా అసలు! ఏదో ఒక రోజు భగవంతుడు గుణ పాఠం నేర్పకపోడు!" అంది సుజాత.

"దేవుడు తనకు గుణపాఠం నేర్పినప్పుడు తను నేర్చుకుంటాడులే కానీ భగవంతుడు ఇప్పుడు మనకు నేర్పిన గుణపాఠాన్ని మనం నేర్చుకుందాం ముందు!" అన్నాడు ప్రకాష్.

"మనకు గుణపాఠమా, మనమేం తప్పు చేశాం?" కోపంగా అడిగింది సుజాత.

"ఏం చేశామా? మీ అన్నయ్య తన అంద మైన కూతుర్ని ఇస్తాడన్న నమ్మకంతో ఈ మధ్యలో వచ్చిన ఎంతమంది అమ్మాయిలకు ఎన్ని వంకలు పెట్టి తిరస్కరించారు మీ అమ్మా కొడుకులు?... నీ కొడుకు కూడా ఏమీ తక్కువ తినలేదు. అందాల భరిణలాంటి అమ్మాయిని చూసి ఆశ పడటం తప్పని నేను అనను...




కానీ ఆ సంబంధానికి నువ్వు ఒప్పుకోవేమో అని నిన్ను ఒప్పించటానికి ఏమని అన్నాడు? "బుజ్జి మామయ్య వాళ్ళు మనతో పోలిస్తే లేనివాళ్ళే కదా అమ్మా! పేదింటి పిల్లని చేసు కుంటే మనం చెప్పినట్లు పడి ఉంటుంది అనలా?...అంటే అదేదో సినిమాలో చెప్పి నట్లు, ఆ అమ్మాయి పట్ల గౌరవాన్ని కాదు, చిన్నతనాన్ని సృష్టించి వివాహ బంధానికి పునాది వేద్దామనుకున్నాడు, ఎంత తప్పు?"

"ఏదో నేను వాళ్ళ సంబంధం ఇష్టపడనేమో నని, పాపం నన్ను ఒప్పించడం కోసం... లౌక్యంగా మాట్లాడాడులేండి పిల్ల సన్నాసి, అదీ తప్పేనా?"

"లౌక్యం అంటే ఎదుటి మనిషిని నొప్పించ కుండా నిజాయితీ నిలుపుకోవడానికి సాధనం అవ్వాలి కానీ నిజాన్ని అబద్ధంతో అపభ్రంశం చేసే ఆయుధం కాకూడదు సుజాతా...


ఇవన్నీ నేనూ ముందే చెప్పుండాలి. కానీ మీ ఇద్దరి ఆరాటంలో నాకు మాట్లాడే అవ కాశం ఏదీ! సరేలే ఇప్పటికైనా దారిలోకి వద్దాం, పద!"

అహంకారాలతో కాక ఆత్మీయ భావనతో ముందుకు వెళితే ఇంతకు మించిన సంబం ధాలు దొరకక పోవు" అని సుజాత భుజం తట్టాడు ప్రకాష్.

సుజాత కార్లోకి ఎక్కేటప్పటికీ వాళ్ళ మాట లన్నీ వింటూనే ఉన్న ధీరజ్ ధైర్యం కోల్పోయి డీలపడిపోయి దిక్కుల వంక తిక్క తిక్కగా చూస్తూ ఉన్నాడు.

"రామచంద్రా! 'మబ్బుల్లో నీళ్ళు చూసి ముంత వలకబోసుకున్నారని' సామెత చెప్పి నట్లు మా సీజన్ అన్నయ్య మీద ఆశ పెట్టుకుని మధ్యలో వచ్చిన మంచి మంచి సంబంధాలన్నీ వదులుకున్నాం.

చిన్నప్పటి నుంచీ అలవాటయిన నేనే తట్టు కోలేక పోతున్నాను. ఇంక ఈ సీజన్ మామయ్య వేసిన సీజనింగ్ ఘాటు నుండి నా చిన్నారి పెళ్ళి కొడుకు ఎప్పటికి తేరుకుంటాడో..." అని తల బాదుకుంది సుజాత.





# స్మైల్ స్టార్స్

మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని పరిచయం చేస్తున్న శీర్షిక! 16


## భాను (సెల్ఫీ)


**భా**ను అన్న కలం పేరుతో కార్టూన్లు వేస్తున్న నా పూర్తి పేరు గుంట్రెడ్డి భాస్కరరావు. తేదీ 28.9.1958 న విజయనగరం జిల్లా ప్రస్తుతం పార్వతీ పురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రావివలసలో జన్మించాను. తల్లిదండ్రులు స్వర్గీయ శ్రీ సూర్యనారాయణ నాయుడు,స్వర్గీయ శ్రీ అప్పమ్మ నాయురాలు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా దాదాపు 40 సంవత్సరాలు పని చేసి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నాను.


కార్టూనిస్ట్ శ్రీశంకర్, బావ మరిది స్వర్గీయ శ్రీ కొల్లి రామారావు, ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు ప్రోత్సాహంతో నా మొదటి కార్టూన్ 1983 వ సంవత్సరం ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురితమయింది. తెలుగు పత్రికలలో 3,500 కు పైగా నా కార్టూన్‌లు ప్రచురితం అయ్యాయి. ప్రముఖ కార్టూనిస్టు శ్రీ అబూ అబ్రహం నా కార్టూన్ ను ప్రశంసించడం, 2005వ సంవత్సరం స్వర్గీయ శ్రీ భువన్ బెటర్ కార్టూన్ అవార్డు పొందాను. 2012, 2014, 2024వ సంవత్సరం శ్రీ తలిశెట్టి అవార్డు బహుమతులు పొందడం, 2017వ సంవత్సరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో తెలంగాణ ప్రభుత్వం కార్టూన్ బహుమతి పొందడం, 2020 సంవత్సరం నాటా వారు నిర్వహించిన కార్టూన్ల పోటీలో మొదటి బహుమతి పొందడం, గుల్లపల్లి అరుణకుమారి కార్టూన్ల పోటీలో 2023 వ సంవత్సరం మొదటి బహుమతి పొందడం, 2024 సంవత్సరంలో అభిమాని ఫౌండేషన్ బొబ్బిలి వారి సేవాశ్రీ ఎక్సెలైన్సీ అవార్డ్. ఇవన్నీ నా కార్టూన్ కెరీర్‌లో గొప్ప అను భూతులు.


ఇక నా కుటుంబం నా భార్య పార్వతి, కుమారులు రాజశేఖర్ నాయుడు, చంద్రశేఖర్ ఇద్దరు కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగులు, కోడళ్ళు నళిని, పూర్ణిమ. మనవడు,మనవరాళ్ళు చరిష్మ, కుందన, ఈహాని సాయి, వేదాన్ష్ శివ. ముఖ్యంగా శ్రీకాకుళంలో గురజాడ విద్యాసంస్థల అధినేత సోదరులు శ్రీజీవి స్వామినాయుడు గారి ప్రోత్సాహం మరువలేనిది.


కార్టూనిస్టులకు అనేక పోటీలు నిర్వహించి, ఒక వేదిక ఏర్పాటు చేసి, బహు మతులు ఇస్తున్న హాస్యానందం ఎడిటర్ శ్రీ రాముగారికి నా కృత జ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.


















ఏమండోయ్..! మనవరాల్ని ఆడిస్తున్నారా..?!
లేదు.. అదే నన్ను ఆడిస్తుంది..!
నేటి పిల్లలు ముదురు --
భాను



వచ్చినవాడెవడో, చూసుకోకుండా, నీపనికి ఈక్షణమే... మంచి ముహూర్తం ఉందంటే, ఊరుకొంటడా..!!
క. శివశాస్త్రి, ముహూర్త, జ్యోతిష్య విద్వాన్.
భాను



మాటలతో.. కోటలు కట్టి, మీ ఫ్రెండ్ కోట్లు సంపాదించడా..? యింతకి.. ఏవ్యాపారం..?!
రియల్ ఎస్టేట్..!
భాను


జాగ్రత్తలు
మందులు
షుగర్ బి.పి.
షుగర్, బి.పి ఉన్నమనిషి.. జీవితంపులిస్వారీలాంటిది... మందులు, జాగ్రత్తలుతప్పనిసరి
వైద్యనిపుణులు
భాను


టెస్టులకి, పదివేలు, మందులకుపది యాభాయిలా..? యింతకి జబ్బేంటి..?!
కార్పొరేట్ ఆస్పత్రి
జలుబు..!
భాను


హు.. ప్రకటనలు రానివ్వండి చూద్దాం..!!
భాను


ఈ మధ్యే ఆడపిల్ల పెళ్లి చేసారని తెలియక.. మీ యింటికొచ్చా.. పాపం ఈ వెయ్యి ఉంచండి.. ఖర్చులకి..!!
భాను


మీ ఆరోగ్య, ఆర్థికవిషయాలు అడుగుతున్నాడు.. ఎవరాయన?!
నా అప్పుకు ష్యూరిటీ యిచ్చినాయన!
భాను



# సినిమా తీద్దామా?

## సీన్ సీన్‌కో రైటర్!

గొలుసు సీరియల్

**ఈ నెల రచయితలు: అవధానుల జగన్నాథ రావు ✦ రుద్రపాక సామ్రాజ్యలక్ష్మి ✦ మాలతీ ప్రకాష్**

### ఐదవ సీన్– అవధానుల జగన్నాథ రావు

(గత సంచిక తరువాయి)

**పావు గంట తర్వాత సుయోధనరావు భార్య ట్రేలో కప్పులు పెట్టుకుని వచ్చింది.**

**శేషాచలాన్ని మొదట ఆకర్షించినది ఆమె జుట్టు. చంపల దగ్గర ముగ్గుబుట్ట లాంటి తెలుపు... నడి నెత్తిన తారు రాసినట్లు నలుపు... మధ్య అంతా ఎరుపు, నారింజ రంగు, ఇటుక రంగుల మిశ్రమం... వెరసి ఒక కొత్త రకం ఇంద్ర ధనుస్సు!**

**'తలకు పెట్టుకొనే గోరింటాకు ప్రభావం..." అనుకొన్నాడు శేషాచలం.**

**"చెల్లెమ్మా! టీ సూపర్" అన్నాడు ఒక గుటక వేసి.**

**ఆమె మోహం ధుమధుమలాడింది.**

"అదేంటండీ బాబాయిగారూ నన్ను చెల్లెమ్మా అని పిలుస్తారు? నేను పదహారవ ఏటనే పిల్లలని కని ముప్పై అయిదవ ఏటనే మనుమల్ని ఎత్తాను. ఏదీ, మొన్ననే నాకు నలభై వెళ్లాయి. నన్ను అమ్మాయ్ అని గాని ఛాయా అనీ గానీ పిలవండి!" అంది విసురుగా.

ఖంగుతిన్నాడు శేషాచలం.

'మొన్ననే అంటే పదేళ్లా? పదిహేనేళ్లా?' అని కాసేపు ఆలోచించి మానేశాడు. సినిమాలో హీరో గయ్యాళి తల్లి వేషం ఒకటుంది. ఈవిడకు ఇస్తే ఎలా ఉంటుంది?" అని ఆలోచనలో పడ్డాడు. కానీ ఆ విషయం ఇంత త్వరలో ఆమె ముందు ఎత్తే సాహసం చెయ్యలేదు.

"సరే వస్తానమ్మాయ్" అంటూ బయట పడి గుండెల నిండా గాలి పీల్చుకొన్నాడు.

✦✦✦

శేషాచలం తమ అపార్ట్మెంట్ గేటులోంచి లోపలికి అడుగు పెడుతుంటే ఫోర్ నాట్ ఎయిట్ లోని ప్రతిభ అమాంతం అతని ముందు ప్రత్యక్షం అయ్యి కాళ్ళ మీద పడిపోయింది.

"యింకా సినిమా మొదలు కూడా పెట్టలేదు కదమ్మా... ఇప్పటి నుండీ ఎందుకీ దండాలు?" అన్నాడు శేషాచల విస్తుబోతూ.

"మీరు నాకు అభయ హస్తం ఇచ్చేదాకా మీ కాళ్ళు వదలను తాత గారూ!" అంది ప్రతిభ.

"సరే అభయ హస్తం ఇచ్చేస్తున్నాను లే..."

"తాతగారూ! మీరు ఇందాకా పక్క అపార్ట్మెంట్స్‌లోని సుయోధనరావు గారి ఇంటికి వెళ్ళారు కదూ? నేను దూరం నుండి చూసాను!"

"అవునమ్మా!"

"మరేమో ఆ సుయోధనరావుగారి భార్య మా అమ్మకు అత్త. మీ సినిమాలో నేను యాక్ట్ చేస్తున్నానని ఆమెకు, ఆయనకూ కూడా ఎంత మాత్రం తెలియకూడదు. వాళ్లకు తెలిస్తే మా అమ్మకు చెప్తారు. అమ్మకు ఈ విషయం తెలిసిందంటే... నన్ను గదిలో పెట్టి తాళం వేస్తుంది."

'చచ్చింది గొర్రె! ఆ సుయోధరావుని ఈ ప్రతిభకు తండ్రిగా వేషం ఇప్పిద్దాం అనుకున్నాడు. తీరా ఇప్పుడు ఈ అమ్మాయి వాళ్లకు తన విషయమే తెలియకూడదు అంటోంది. ఏం చెయ్యాలిప్పుడు?' అనుకొంటూ తల పట్టుకొన్నాడు శేషాచలం.


**ఫ్లాష్‌బ్యాక్–** శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో...

## ఆరవసీన్– రుద్రపాక సామ్రాజ్యలక్ష్మి

శేషాచలం ఇంట్లో అడుగు పెట్టగానే, కాంతం– "వాకింగ్ అంటూ బయల్దేరి, ఊళ్లో సొదలన్నీ నెత్తికెక్కించుకుని, ఇంటికి రాగానే నా తల అదిరి పోతోంది... గిర్రున చక్ర భ్రమణంలా తిరిగిపోతోంది... అంటూ ఒక స్ట్రాంగ్ కాఫీ తీసుకునిరా అంటూ నా ప్రాణం తీస్తారు. నేనెక్కడ చచ్చేదిరా భగవంతుడా? పైగా ఇప్పుడేమో సినిమా తీస్తానంటూ మొదలుపెట్టారు. ఈ గ్రాఫిక్స్ గట్రా వచ్చిన తరువాత ఈ ముసలాడి సినిమా ఎవరు చూస్తారుటా?" అంటూ ఒక సాగదీయింపు విడిచి...

"ఉండండి! కాఫీ తీసుకొస్తాను!" అంది కాంతం.

"వద్దులేవే... ఇవాళ సుయోధనరావ్ ఇంటికి వెళ్ళాను. వాళ్ళావిడ టీ ఇచ్చిందిలే!" అన్నాడు శేషాచలం.



"ఈ సినిమా పుణ్యమా అని ఇంకా కొంపలమ్మటే కూడా తిరుగుతున్నారా?" అంటూ కాంతం రుసరుస లాడింది.

"కాంతం ఇటురా!... నీకో మాట చెబుతాను. ఈ బుంగ మీసాలు, బూరి బుగ్గల సుయోధన్రావ్ ఆకారము గాంభీర్యం కానీ, బయటే పులి, ఇంట్లో పిల్లేనే!..." అంటూ కాంతాన్ని ఐస్ చెయ్యటానికి చిన్న చణుకు వేశాడు శేషాచలం.

కాంతానికి పొరుగింటి కబుర్లంటే మహ సరదా.

"అవును నేనూ గమనించానండీ.వాళ్ళింట్లోంచి మాటలు మధ్యాహ్నపూట గట్టిగా వినిపిస్తాయి. అప్పుడే అనుకున్నా, ఇద్దరూ సముజ్జీలే, రెండూ గట్టి పిండాలలానే ఉన్నారు అని!" అంది కాంతం.

"రెండు చేతులు కలిస్తేనే కదండీ తప్పట్లు అయ్యేది." అంటూ ముక్కు మీద వేలేసుకుని... "ఆ ఛాయా అంతటిదే లెండి!" అంది కాంతం.

"నీకెట్లా తెలుసే ఛాయ గురించి?" అన్నాడు శేషాచలం.

"మా ఆడవాళ్ళకి బోల్డన్ని మీటింగ్ ప్లేసులు ఉంటాయండీ. గుళ్ళు, పేరంటాలు, ఇంకా ఆశమ్మ ఓశమ్మ కబుర్లు వీటన్నిటిలో చింతకాయ పచ్చడి దగ్గర నుండి చంద్రయాన్ వరకు తిరగేసేస్తాం. మీ మగవాళ్ళకి మల్లే కాదు మేము!" అంటూ ఎడమ చెయ్యి, తర్జని చూపిస్తూ, కొంగు దోపుకుంటూ చెప్పింది కాంతం.

కాంతం హావభావాలు చూసి – 'నా సినిమాలోని గయ్యాళి పాత్ర దీనికే ఇస్తే పోతుందేమో... పైసా ఖర్చుండదు. పైగా సూర్యాకాంతానికి మించిన భావ ప్రకటన ఉంది దీని దగ్గర... ఏమైందిలే... పూర్వం

సినిమాల్లో దర్శకుడిగా భర్త, హీరోయిన్గా భార్య చెయ్యలా? తీగ పుచ్చుకుని హీరోయిన్, కొమ్మ పుచ్చుకుని హీరో ఎంత స్పీడు సాంగైనా యాక్ట్ చెయ్యలా? తప్పేముంది! పైగా ప్రతిభ తోటి చిక్కు ఉండదు. 'మా ఆవిడ కూడా ఉంది లెండి. మీ అమ్మాయికి వచ్చిన భయమేమీ లేదు' అని నచ్చ చెప్పవచ్చు వాళ్ళ అమ్మకి. దాచి ఆడపిల్లతో యాక్షన్ చేయించటం కష్టం కదా! సినిమా ప్రజలలోకి వెళ్ళినప్పుడైనా చిక్కేగా. ప్రతిభ చిన్న పిల్ల కాబట్టి ఇవన్నీ ఆలోచించటం లేదు అని మనసులో అనుకున్నాడు శేషాచలం.


"కాంతంతో చెప్పాలంటే భయం.

"ఏమిటీ? నీ సినిమాల పిచ్చి నాకు కూడా ఎక్కిస్తున్నావా? నేనేమన్నా చిన్న బొప్పినా? సినిమాల్లో యాక్ట్ చెయ్యటానికి అని నా మీద ఫైర్ అయిపోయి అప్పడాల కర్ర పుచ్చుకుంటుందేమో?... ఆ అప్పడాల కర్రను దాచి... తర్వాత ఈ విషయం బయట పెట్టాలి అను కున్నాడు శేషాచలం.

అయినా రేపు కాంతం మంచి మూడ్లో ఉన్నప్పుడు చెప్పాలి. ఇప్పుడు చెబితే సినిమా తిరగబడుతుంది అనుకున్నాడు మనసులో శేషాచలం.

## ఏడవ సీన్–మాలతీ ప్రకాష్

మరోపక్క శేషాచలం ఇంట్లోంచి అడుగు బయటకి పెట్టిన మహేష్ అతన్ని నానా తిట్లు తిట్టుకోసాగాడు.




'నేనేదో ఈ సినిమా ఛాన్స్ వాడుకుని, మేరీ సప్నోంకా రాణి, మేరీ దిల్కా టుకడా, ప్రతిభా డార్లింగుకి లవ్ ఎక్స్ప్రెస్ చేసి... సూపర్ డ్యూయెట్ సాంగ్ వేస్కొని... మా లవ్ జర్నీ స్టార్ట్ చేద్దామనుకుంటే... ఈ పెద్దాయన మొత్తానికి నాకే టెండర్ పెట్టాడు!' అని కోపంతో పళ్లునూరుతూ... 'చేతిలో పైసా పెట్టకుండా కాస్ట్యూమ్స్ కొనుక్కోవాలంట, కాస్ట్యూమ్స్!... ప్రపంచ పిసినారి సంఘానికి ప్రధానాధ్యక్షుడిలా, పీచు పీనాసి మొహమూ ఈయనానూ! పోనీ గట్టిగా అడుగుదామా అంటే, మళ్ళీ ఎక్కడ ఆ వాచ్మాన్ కొడుకుని హీరోగా పెట్టుకుంటానంటాడోనని భయమేస్తోంది. రాక రాక వచ్చిన అవకాశం చేతులారా పోగొట్టుకోలేనుగా!...' అంటూ మనసులోనే పరిపరి విధాలుగా ఆలోచించడం మొదలెట్టాడు మహేష్.

అంతలోనే శేషాచలం రాసిన వెర్రి పిచ్చి పాట గుర్తొచ్చి, 'పిచ్చి పిచ్చిగా ప్రేమించుకుందామా, ప్రతి డార్లింగ్!... కాలేజీ మానేసి మూవీకెళ్దామా!' అని తనదైన ట్యూన్లో పాడుకుంటూ, ఊహల్లో తేలిపోతూ...


'వహ్వా, వహ్వా! ఏమన్నా లిరిక్సా అసలు... నా రాణితో కలిసి ప్రేమగా వేపమిరపకాయ పచ్చడితో చేసిన ముద్దల్ని ముద్దుముద్దుగా తినిపించుకోవడం కోసమైనా సరే, నేనీ మాత్రం ఖర్చుపెట్టక తప్పదు. కానీ ఇప్పటికిప్పుడు నాకంత డబ్బులిచ్చేవాళ్ళు ఎవరున్నారబ్బా? పైగా సినిమా షూటింగ్ కోసం అంటే ఎవరిస్తారు?' అనుకుంటూ తీవ్రమైన ఆలోచనలో పడ్డాడు.

సరిగ్గా అప్పుడే ఆరోజు ఉదయం తన సప్లిమెంటరీ ఎగ్జామ్ ఫీజ్ కట్టడం కోసమని... వాళ్ళమ్మ ఇచ్చిన డబ్బుల సంగతి గుర్తుకొచ్చింది మహేష్కి!

వెంటనే జేబులో డబ్బులు బయటకు తీసి, 'ఇప్పుడు వీటిని కాస్ట్యూమ్స్ కోసం ఖర్చు చేసేస్తే, మా చాదస్తపు అమ్మ నా చెమ్డాలు ఊడేలా కొడ్తుందే!' అని ఒకపక్క భయంతో వణుకు పుడుతున్నా...

'ఆc...తొక్కలే, ఇప్పటికెన్నిసార్లు తినలేదు ఇట్టాంటి దెబ్బలు, తిట్లు. ఇవన్నీ నాకేం కొత్తా! అయినా ఈ విషయం అమ్మకి తెలియకుండా ఏదోలా మేనేజ్ చేసేస్తాలే. వేర్ దేర్ ఈజ్






లవ్వు, దేర్ కమింగ్ డేరింగ్ కెవ్వు కెవ్వేహే!' అంటూ గట్టిగా తన జబ్బ తనే చరుచుకుంటూ,

"వావ్, ఏం చెప్పావురా మహేషూ! యాక్టింగులోనే కాదు, ఇరగదీసేలా డైలాగులు చెప్పడంలో కూడా నిన్నెవ్వడూ కొట్టలేడెహే!" అని తెగ మురుసుకుంటూ, వరద గోదారిలా ఉరకలు వేస్తున్న మనసుతో, మెరుపువేగంతో చీప్ అండ్ బెస్ట్ బట్టలమ్మే మార్కెట్‌కి వెళ్ళి, శేషాచలం స్పెషల్ సాంగ్ థీమ్కి సరిపోయేలా, అదిరిపోయే మూడు జతల బట్టలు కొనుక్కుని, ఈలేసుకుంటూ ఇంటి దారి పట్టాడు.

"శేషాచలం తాతా! పూయిస్తా మా ప్రేమ పూత... నా యాక్టింగ్తో పెట్టిస్తా నీతో కూత... మోగిస్తా మోత..." అని పాడుకుంటూ... ప్రతిభతో డ్యూయెట్ సీన్ ఊహల్లో తేలియాడుతూ ఇంటికి చేరుకున్న మహేష్, గుమ్మం ముందు నిలబడి భద్రకాళిలా తననే ఉరిమురిమి చూస్తున్న తల్లిని గమనించుకోలేదు.

అప్పుడే ఒక్కసారిగా "యారా! అయిపోయినియ్యా ఊరమ్మట నీ బలాదూరు తిరుగుళ్ళు?" అంటూ హైపిచ్లో తన తల్లి చాముండేశ్వరి కంఠస్వరం వినిపించగానే, ఒక్కక్షణం నెత్తిమీద పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాడు. మరుక్షణం తమాయించుకొని, బట్టల కవర్లు వెనక్కి దాచేసి... ఆమెవైపు చూస్తూ ఒక వెర్రి నవ్వు నవ్వాడు.

"ఏంట్రా, అడిగినదానికి సమాధానం చెప్పకుండా... ఎందుకట్టా ఎర్రి నవ్వులు నవ్వుతున్నావు? నీ వాలకం చూస్తాంటే నాకేదో తేడా కొడతాందిరో!" అంటూ కళ్ళు చికిలించి అనుమానంగా చూసింది.

'అయిపోయింది... ఏది జరగకూడదనుకున్నానో అదే జరిగింది. ఇప్పుడీ బట్టలుగానీ చూసిందంటే, నన్ను నిలువునా పాతేసిద్ది... ఎలా రా బాబూ ఇక్కడ్నుంచి తప్పించుకునేది' అనుకుంటూ దిక్కులు చూడసాగాడు.

ఈ గ్యాప్‌లోనే అతని చేతిలో కవర్లు ఆమె దేగ కళ్ళలో పడిపోవడం... ఒక్క ఉదుటున ఆ కవర్లు లాక్కొని, అందులో చిత్రాతిచిత్రంగా ఉన్న గుడ్డపీలికల్ని చూసి... ఉగ్రరూపం దాల్చడం కూడా అయ్యింది.

"ఇంటర్ పరీక్ష ప్యాసవ్వరా అంటే... ఇయ్యా నువ్వేసే యాషాలు! ఐనా ఏంట్రా ఇయ్యన్నీ, ఇయ్యి కొనడానికి నీకు పైసలెక్కడియ్యిరా?" అంటూ ఖంగుమన్న తల్లి స్వరానికి భయపడి, ఏం సమాధానం చెప్పాలో తెలియక నీళ్ళు నమిలాడు. అంతలోనే ఒక ఐడియా రావడంతో చిన్నగా తలొంచి...

"అంటే..అదీ..మరేమో మన కాలనీలో శేషాచలం తాతగారున్నారు కదమ్మా! ఆయనేదో ఓటీటీ సినిమా తీస్తున్నారంట. దానిలో హీరోగా నేను తప్ప ఇంకెవరూ సూటవ్వరంట. మా అమ్మకివన్నీ నచ్చవు, నేను బాగా చదువుకోవాలని తన కోరిక. అందుకే యాక్టింగ్లవీ చెయ్యనని నేనెంత చెప్పినా వినకుండా, బలవంతంగా చేతిలో డబ్బులు పెట్టేసి, షూటింగ్ కోసం కాస్ట్యూమ్స్ తెచ్చుకోమన్నారు. **(సశేషం)**




## కార్టూన్ పోటీ ఫలితాలు వచ్చే సంచికలో...




**మీ ఇంటి పేరు ఏమిటి అని ఓ అబ్బాయిని అడిగితే... 'శ్రీలక్ష్మీ నిలయం' అన్నాట్ట.**

**"అది కాదురా అబ్బాయ్! మీ సర్‌నేమ్ రా?" అంటే మా సార్ పేరంటే ఏ సార్‌ది సార్! స్కూల్లో ఆయనదా, కాలేజీలో ఆయనదా? అయినా బోలెడుమంది సార్‌లు వున్నారు. ఎవరి పేరు చెప్పమంటారు?" అన్నాడుట.**

**అడిగినవాడు జుట్టు పీక్కోక ఏం చేస్తాడు.**

ఇంటి పేరు అంటే ఇప్పుడు చాలామందికి తెలీడంలేదు. అప్లికేషన్స్‌లో, ఆన్‌లైన్ రైల్వే, విమానం టికెట్ల బుకింగుల్లో అంతటా ఫస్ట్ నేమ్, మిడిల్‌నేమ్, లాస్ట్‌నేమ్ అని నింపాల్సి వస్తోంది. ఏది ఫస్ట్‌నేమో... ఏది లాస్ట్‌నేమో కూడా అనుమానమే!

ఇప్పుడు సగానికి సగంమంది తెలుగు వాళ్ళకి అమెరికాలో మాత్రం అసలుపేరు బదులు ఇక్కడి ఇంటి పేరే వ్యవహారంలోకి వచ్చేస్తోంది.

హాస్యానందం ఎడిటర్‌గారు అమెరికాకు వెళ్ళారనుకోండి... "వెల్‌కమ్ పండాజీ! రండి




పండాగారు!" అంటారు.

ఆయన మనకు రాముగారు కావచ్చు కానీ అమెరికన్స్‌కు మాత్రం 'పండా'గారు మరి! ఎందుకంటే పండా రాము గారు అని మనం ఇక్కడ ఇంటి పేరుతో వ్యవహరించుకుంటాం. అమెరికాలో ఆయన రాము పండా అవుతారు మరి!

ఇప్పుడు ఇండియాలో కూడా ఈ ధోరణి వచ్చేస్తోంది లెండి.

ఇంటి పేరు అసలు పేరు తర్వాత చేర్చుకో వడం ఇప్పటి ఫ్యాషన్! ఇంటిపేరు ఎలా ఏర్పడతాయి అంటే అదో పెద్ద చరిత్ర.

దానిమీద యూనివర్సిటీల్లో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాలు వెలువరించి డాక్టరేట్‌లు తెచ్చుకున్నవారున్నారు. ఇంటి పేర్లు, గ్రామ నామాలు ఇవన్నీ కూడా పరిశోధక అంశాల య్యాయి.

తాతతండ్రులు ఒకప్పుడు నివసించిన ఊరి పేర్లను బట్టి ఇంటి పేర్లు ఏర్పడడం ఒక రకం అయితే ఎలా వచ్చాయో తెలీదు గాని పప్పు, కూర, అన్నం, అల్లం, చారు, పెరుగు, తోట కూర, ఆవాలు, మిరియాలు ఇవన్నీ కూడా ఇంటి పేర్లుగా వున్నవారున్నారు. మీ మిత్రుల్లో కూడా ఎవరో ఈ ఇంటి పేరు వాళ్ళు వుండేవుండవచ్చు లెండి!

పూర్వం "ఒరే అబ్బాయ్!... నువ్వు బాగా చదువుకుని ఇంటిపేరు నిలబెట్టాలిరా!..." అనే వారు. ఇంటి పేరు అంటే వంశప్రతిష్ఠగా పరి గణించేవారు. ఇంటి పేరే ప్రాముఖ్యం కనుక 'ఫలానా వారి వంశంలో చెడబుట్టాడు' అని దారితప్పిన వాడిని ఆ ఇంటి పేరిటనే తిట్టే వారు కూడాను.

ఇప్పుడంటే పేర్ల గురించి ఇంకా అంత తాపత్రయం వుంది గానీ, మునుముందు అసలు సెల్ నెంబర్లతోనే మనుషులు వ్యవ హరింపబడినా నివ్వెరపోనక్కర్లేదు! లేదూ... ఆధార్‌కార్డు నెంబర్‌తో మనిషిని వ్యవహరిస్తా రేమో! ఇప్పటికే చాలాచోట్ల మనపేరు మాట ఎలా వున్నా ఆధార్‌కార్డు నెంబర్, సెల్ నెంబర్ రాయడమే అతి ముఖ్యం అయి కూర్చుంటు న్నాయి.

ప్రయాణం టికెట్లు బుకింగ్ నుంచి...

హోటల్‌రూమ్ బుకింగ్‌ల వరకూ సెల్ నెంబర్‌తో, ఆధార్‌కార్డు నెంబర్‌తో టాలీ అవడమే ముఖ్యమైపోతోంది.

కలంపేర్లు పెట్టుకుని ప్రసిద్ధులైన వారికి ఇక ఇంటిపేరు గొడవలేదు.

శ్రీశ్రీ, ఆరుద్ర, అజంతా, బైరాగి, విహారి, ఇదిగో మీ సుధామ... ఇలా కలంపేర్ల వాళ్ళ అసలు పేరు ఇంటిపేర్లు మరుగున పడిపోతాయి.

కలంపేర్లు పెట్టుకున్న వారి అసలు పేర్లతో శ్రీ కె.పి.అశోక్‌కుమార్ గారు అనుకుంటా ఓ ఉద్గ్రంథమే ప్రచురించారు.


తమాషాగా కొందరి పేర్లకు వారి ఇంటిపేర్లు కూడా మరుగున పడిపోయి వారి ప్రసిద్ధమైన ఓ కార్యాచరణంతో అదే యింటిపేరై కూర్చుంటుంది.

ఇప్పుడు పండారాముగారంటే ఎవరో తెలియక పోవచ్చు గానీ హాస్యానందం రాముగారంటే అందరికీ తెలిసినట్లు!

సినిమాల్లో షావుకారు జానకి, కళ్ళు చిదంబరం, సుత్తి వీరభద్రరావు, వెన్నెల కిషోర్ వంటి పేర్లలోని షావుకారు, కళ్ళు, సుత్తి, వెన్నెల వాళ్ళ ఇంటి పేర్లు కానేకావు.

బొక్కల కిషోర్‌కుమార్ అంటే ఎవరికి తెలుస్తుంది? వెన్నెల కిషోర్ అంటేనే తెలుస్తుంది.


అలాగే సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి ఇంటిపేరు అది కాదు. సిరివెన్నెల సినిమాకు రాసిన పాటల ప్రసిద్ధి వల్ల అలా స్థిరపడ్డారు.




ఆయన ఇంటి పేరు నిజానికి 'చేంబోలు'.

జంధ్యాల, దేవులపల్లి, కొడవటిగంటి, అనిశెట్టి అంటూ అసలు వారి ఇంటిపేర్లతోనే చిలకమర్తి, పానుగంటిల నుండి పేరొందిన వారున్నారు.

నిజానికి ఇంటి పేరు నిలబెట్టిన వారంటే మరి అలాంటి వాళ్ళని చెప్పాలి! అలాగే తాము నెలకొల్పిన సంస్థల పేర్లతో 'వంశీ' రామరాజు (రామరాజు పురుషోత్తమదాసు టాండన్), 'కిన్నెర' రఘురాం (మద్దాళి రఘురాం), 'రసమయి'రాము (ఎం.కె. రాము), 'సాధన' నరసింహాచార్య, 'అభినందన' భవాని 'రాగ సప్తస్వరం' రాజ్యలక్ష్మి ఇలా పేరు పొందినవారి ఇంటిపేర్లు ప్రస్తావనలోకి రావు.




వారి వారి వైయక్తిక రికార్డుల్లో తప్ప.

పత్రిక ఎడిటర్‌గా స్వాతి బలరాం గారు అంటే స్ఫురించినంత తొందరగా వేమూరి బలరాం అంటే ఎవరో స్ఫురించకపోవచ్చు.

పేరులో ఏముంది? అని బహుశా ఇలాంటి వ్యవహారాల వల్లనే ఇంటిపేర్ల ప్రాముఖ్యం క్రమేపీ మరుగున పడుతోందేమోననిపిస్తుంది.

కానీ అవి నిజానికి మన మూలాలు.

ఫలవృక్ష సంభరితమైన చెట్టుకి 'వేర్లు' భూమిలో పాతుకున్నవి ఎంత ముఖ్యమో అవే ఎలా జీవశక్తులో అలానే మన ఇంటిపేర్లు మన వంశ మౌలికతలు.

'ఓ ఇంటివాడవు కా' అంటే పెళ్లి చేసుకోమని అర్థం అయినా, ఓ సొంత యిల్లు ఏర్పరచుకోవడం కూడా.

ఇంటివాడు కావడమనే కల నెరవేర్చుకోవడమే. ఇండిపెండెంట్ ఇల్లు కట్టుకుంటే శ్రీలక్ష్మీనిలయం, శ్రీ సాయిసదన్, గంధకుటి అంటూ ఏదో పేరు మనం పెట్టుకోవచ్చు గానీ ఇప్పుడు అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగిపోయి గేటెడ్ కమ్యూనిటీలు వచ్చాక ఆ 'ఇంటిపేర్లా' హుళక్కే కదా! 'మీ ఇల్లెక్కడ?' అంటే ఇప్పుడు నిజంగానే ఏ ముప్ఫయోఫ్లోరో ఎక్కడమే! (లిఫ్ట్‌లోనే అనుకోండి) సుధామ, రాజపుష్ప అట్రియా, కోకపేట, హైద్రాబాద్ అని రాస్తే నాకు పుస్తకం పంపితే వచ్చేస్తోంది అంటే... ఇంక ఇంటిపేరు భాగ్యం సంగతి వేరేల?...

ఇదే నేటి 'వాక్' చిత్రం!






**ఈ నెల నుండి ఒక ఇతర భాషలకు చెందిన భారతీయ కార్టూనిస్టులను పరిచయం చేయబోతున్నాము.**


**నిర్వహణ: నాగిశెట్టి**

## ఈ నెల కార్టూనిస్ట్- శ్రీ రఘుపతి శృంగేరి

ప్రముఖ భారతీయ కార్టూనిస్ట్, కారికేచరిస్ట్, ఇలస్ట్రేటర్, అనిమేటర్ మరియు యూఎక్స్ డిజైనర్- **శ్రీ రఘుపతి శృంగేరి,** నెమ్మార్, కర్ణాటకలో 4 ఏప్రిల్ 1973న జన్మించారు.

తండ్రి, శ్రీ ఎన్ కే శృంఘేశ్వర రావు, తల్లి, యశోదారావు.

ఆయన దవణగేరి, కర్ణాటకలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నుండి మాస్టర్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్స్ డిగ్రీ పొందారు.




రఘుపతిగారి మొదటి కార్టూన్ 1991లో కన్నడ వారపత్రిక విక్రమలో ప్రచురితమైంది.

1996లో దక్షిణ కొరియాలోని దేజియన్‌లో జరిగిన కార్టూన్ పోటీలో తన మొదటి బహుమతిని గెలుచుకున్నారు.

మొదట కిర్లోస్కార్ మల్టీమీడియాలో చేరి, విద్యకు సంబంధించిన సీడీ-రామ్‌లు మరియు గేమ్స్ కోసం కార్టూన్లు, యానిమేషన్లు, ఇలస్ట్రేషన్లు రూపొందించారు.

కొన్నేళ్ళ తరువాత ఫీనిక్స్ గ్లోబల్ సొల్యూషన్స్‌లో ఇండియా బుక్ హౌస్ కోసం పంచతంత్ర కామిక్స్ పై పని చేశారు.

కంపెనీ విలీనం అనంతరం టీసీఎస్‌లో సీనియర్ యూఎక్స్/యూఐ డిజైనర్‌గా కొనసాగారు!

కొద్దికాలం విప్రోలో కూడా పనిచేశారు.

**ప్రసిద్ధ రచనలు ప్రచురణలు:**


చంద్రయాన్-2 పై ఆయన రూపొందించిన కార్టూన్ ప్రసిద్ధి చెందింది. భారతదేశాన్ని ప్రతీకాత్మకంగా ఐఎస్ఆర్వో శాస్త్రవేత్తను కౌగిలించుకొని ఓదార్చేలా చూపుతూ, "ఇండియా ఇస్ విత్ యూ" అనే ట్యాగ్‌లైన్‌తో వేసారు.


తన సోదరుడు డాక్టర్ సతీష్ శ్రీంగేరితో కలిసి ఆర్టూన్స్ అనే కార్టూన్ పుస్తకాన్ని రాశారు.

అలాగే వ్యంగ్య తరంగ అనే మరొక సంకలనాన్ని కూడా వెలువరించారు.

అమితాబ్ బచ్చన్, నటుడు డాక్టర్ రాజ్‌కుమార్, సుష్మా స్వరాజ్, ఎంఎస్ ధోని వంటి పలువురు ప్రముఖుల కారికేచర్లు, ఇలస్ట్రేషన్లు సృష్టించారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని టీ ఆకులు మరియు పెయింట్ బ్రష్‌తో తయారు చేశారు.













**పురస్కారాలు, గౌరవాలు**

కార్టూనింగ్, కారికేచర్, పెయింటింగ్‌లలో 6 అంతర్జా తీయ, 8 జాతీయ, 3 రాష్ట్రస్థాయి పురస్కారాలు అందు కున్నారు.

ఆయన కళలు ఆర్.కె.లక్ష్మణ్, అబూ అబ్రహాం, మారియో మిరాండా వంటి లెజెండరీ భారతీయ కార్టూనిస్టులతో పాటు, ముఖ్యంగా ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన ప్రదర్శనలో ప్రదర్శించబడ్డాయి.

ఆయన కార్టూన్లు 18,000కి పైగా, కర్ణాటకలోని ప్రధాన పత్రికలు, మాసపత్రికలలో ప్రచురించబడ్డాయి.

ఈయన గీతలు చాలా నీట్‌గా ఉండి చూడగానే ఆకర్షించేట్లుగా ఉంటాయి. ఈయన కార్టూన్లు డిజిటల్ పద్ధతిలో ల్యాప్టాప్ పైన వేస్తారు.

వీరి కార్టూన్లు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా హల్చల్ చేస్తూ ఉంటాయి.

శ్రీ రఘుపతి శృంగేరి మంచి కార్టూనిస్టే కాకుండా మంచి స్నేహశీలి కూడా.

ఆయనకీ భవిష్యత్తులో మరింత పేరు రావాలని మనమంతా ఆశిద్దాం.

# హోమ్ టూర్

లక్ష్మి మదన్- 7989916640

**డింగ్ డాంగ్ అంటూ కాలింగ్ బెల్ మోగింది.**

**తలుపు తెరిచిన జయప్రదకి బయట జయసుధ నిలబడి ఉండటం చూసింది.**

**"ఏంటి జయా! ఇలా చెప్పా పెట్టకుండా వచ్చావు? ఉరుములేని పిడుగులా!" అన్నది నవ్వుతూ.**

"లోపలికి రానిస్తావా లేదా?..." అంటూ లోపలికి తోసుకొని వచ్చి సోఫాలో కూర్చుంది.

ఫ్రిజ్లో నుండి చల్లటి నీళ్లు, కూల్ డ్రింక్ తెచ్చి పెట్టింది జయప్రద.

చల్లగా గొంతులో పడ్డాక జయసుధ కాస్త స్థిమిత పడింది.

"ఇప్పుడు చెప్పు! ఈ అకాల ఆగమనానికి కారణం?"అన్నది జయప్రద.

"ఏమీ లేదే! మా అత్తయ్య బాధ తప్పించుకో వడానికి మీ ఇంటికి వచ్చాను. ఏంటి ఇల్లంతా చిందరవందరగా ఉంది... అందంగా ఇల్లు ఉంటుంది అనుకున్నాను." అన్నది జయసుధ ముఖం చిట్లిస్తూ.

"ఏంటి అద్దంలా మెరుస్తూ ఉంటుందా?... ఎలా ఉంటుంది? పిల్లలు... ఇంటి సభ్యులు అలా పడేస్తూనే ఉంటారు... ఎన్నో పనులు ఉంటాయి. రోజంతా తుడిచిందే తుడవటం కడిగినవే కడగటం చేయలేం కదా!" అన్నది జయప్రద ఆయాసంగా.

"మొన్న వంటింట్లో నేను వంట చేస్తున్నాను. ఇంతలో మా అత్తయ్య పిలిచారు... తీరా ఎందుకు పిలిచారు, అని వస్తే యూట్యూబ్లో హోమ్ టూర్లు చేసే వాళ్ళ వీడియోస్ చూపించి, మన ఇల్లు ఇలా ఎందుకు ఉండదు? అని పెద్ద క్లాసు! ఇలా రోజూ నసతో చంపేస్తుంది. ఏం చేయాలో అర్థం కాక నీ దగ్గరికి వచ్చాను!" అన్నది జయసుధ.

ఇంతలో మళ్ళీ కాలింగ్ బెల్ చప్పుడు అయింది.

తలుపు తీసి చూసిన జయప్రదకు బయట శ్రీదేవి నిలబడి ఉంది.

"ఒసేయ్ శ్రీ! నువ్వేంటే... ఇలా వచ్చావు. ఇప్పుడే జయసుధ వచ్చింది"అన్నది నోరు 70 ఎమ్.ఎమ్ సైజ్ చేసి.




శ్రీదేవి కూడా లోపలికి వచ్చి కూర్చుంది.

మంచినీళ్లు, కూల్ డ్రింక్ తాగింది.

తనది కూడా అదే సమస్య. ఇక్కడ వాళ్ళ ఆయన యూట్యూబ్ వీడియోస్ చూపించి,

"నువ్వు అలా ఎందుకు సర్దుకోవు?... ఎప్పుడు చూసినా మన ఇంట్లో ఎక్కడివి అక్కడే ఉంటాయి!" అని అరుస్తున్నాడు.

"నా సంగతి అంతేనే! మా ఇంట్లో కూడా అదే గోల. నాకు కూడా ఏం చేయాలో అర్థం కావడం లేదు. మొన్న హోమ్ టూర్ చేసే ఆవిడ... "ఇది మా హాలు. ఈ సామాను మా అభిరుచికి తగ్గట్టు కొనుక్కున్నామండి. ఇది సోఫా, సోలాపూర్ నుంచి తెప్పించాము. ఆర్డర్ చేసిన నెలకి వచ్చింది. ఇదిగో ఈ డైనింగ్ టేబుల్ ఢిల్లీ నుంచి తెచ్చాము. దీన్ని ఇలా నీట్ గా సర్దితేనే నాకు ఇష్టం. ఇదిగో చూసారా దీనిమీద ఫ్రూట్స్ ఇలా బాస్కెట్లో అందంగా పెట్టాను. ఈ బాస్కెట్ బాంగ్లాదేశ్ నుండి ఆర్డర్ పెట్టుకున్నాను....

...ఇదిగో కిచెన్ చూడండి. ఈ డబ్బాలన్నీ ఇలా వరుసగా ఎలా పెట్టుకున్నానో! ఇవన్నీ మా ఆడపడుచు అమెరికా నుంచి పంపించింది. నాకు అన్ని డబ్బాలు నీట్గా ఉండి, వాటిలో సామాను కూడా సర్దేసి ఉండాలి. కొంచెం డస్ట్ ఉన్నా నాకు అసలు నచ్చదు.

ఇప్పుడు మా బాత్రూంలోకి రండి....

టట్టడాయ్! ఎంత బాగుందో చూసారా? అసలు ఎంత పరిమళం!.. ఎప్పుడు మా బాత్రూం ఇలాగే ఉంటుంది.


ఈ సబ్బులు సబ్బాయి కంపెనీలో ఆర్డర్ చేశాను. ఇదిగో ఈ షాంపు కంపుల సైట్లో ఆర్డర్ చేశాను....

...ఇదేమో వాష్ బేసిన్. అదేమో కమోడ్ దాని మీద కూర్చుంటాం అన్నమాట. మరి మీరు ఎలా కూర్చుంటారు? కామెంట్ సెక్షన్లో పెట్టండి" ఇలా ఇల్లంతా చూపించి సొల్లు వాగుతుంది.

చివరికి బెడ్ రూమ్‌లు కూడా వదలలేదు.

ఆమె పెట్టుకునే ఇన్నర్స్ దగ్గర నుండి డ్రాలు ఓపెన్ చేసి చూపించింది.

అప్పట్నుండి మా ఇంట్లో సమస్య మొదలైంది.




"నువ్వు అస్సలు శుభ్రంగా పెట్టవు!" అంటూ.

"అయితే మీకు ఒక గుడ్ న్యూస్ నేను చెప్పాలి. ఈ హోమ్ టూర్ చేసిన ఆవిడ ఇల్లు ఇదే కాలనీలో ఉందట. మనం ఒకసారి వెళ్లి ఆమె ఎలా పెట్టుకుంటుందో అడిగి వద్దామా?" అన్నది జయప్రద.

"నిజమా? ఈ కాలనీలో ఉంటుందా? వెళ్లి కలుద్దాం! ఆమె పేరు దమడమ." అన్నది జయసుధ.

"అయితే మరి వాళ్ళ ఇంటికి వెళితే చూడటానికి పర్మిషన్ ఇస్తుందో! లేదో! ఏం చేద్దాం?" అన్నది శ్రీదేవి.

"ఆమె చూడటానికి కూడా చాల అందంగా ఉంటుంది" అన్నది జయప్రద.

"ఆమె కోసం కొన్ని గిఫ్ట్‌లు కొనుక్కొని వెళ్దాము. ఉత్త చేతులతో వెళ్తే బాగుండదు" అని అనుకోని, ముగ్గురు షాపులో ఖరీదైన గిఫ్ట్‌లు కొనుక్కొని, వాళ్ళ ఇంటికి వెళ్లారు.

గేటు దగ్గర ఎవరూ లేరు.

గేట్ తీసుకొని లోపలికి వెళ్ళగానే, యూట్యూబ్ లో చూపినంత అందంగా ఏమీ లేదు. ఎక్కడి చెత్త అక్కడ పేరుకొని ఉంది.

యూట్యూబ్లో వీడియోలో చూపించినప్పుడు, అందమైన పెద్ద రంగు రంగుల ముగ్గు కనబడింది.

ఇప్పుడు కనీసం పాచి ఊడ్చినట్లు కూడా లేదు.

చెట్లన్నీ ఎండిపోయి ఉన్నాయి. నీళ్లు పోసి ఎన్ని రోజులు అయిందో తెలియదు. యూట్యూబ్లో చూపించినప్పుడు మాత్రం రకరకాల పువ్వులు కనిపించాయి. అన్ని ఆర్టిఫిషియల్‌గా పెట్టినట్లు ఉంది.

బెల్ కొట్టగానే ఒక ఆవిడ వచ్చి తలుపు తీసింది.

మురికి పట్టిన పాత నైటీ, ముఖమంతా ముడతలు, జుట్టంతా రేగిపోయి ఉంది.

"ఎవరు కావాలి?" అని అడిగింది.

"దమడమ గారు కావాలండి!" అన్నారు ముగ్గురు.

"నా పేరు దమడమ మీరు ఎందుకు వచ్చారు?" అడిగింది.

ముగ్గురు షాక్ తిన్నారు.

ఈమె ఏంటి ఇలా ఉంది?... ఎంతో అందంగా ఉంటుంది కదా వీడియోలో." అని అనుకొని మనసులో భావాలు బయట కనబడకుండా నవ్వుతూ....

"మీరంటే మాకు చాలా ఇష్టం... మీ వీడియోస్ చూస్తూ ఉంటాము... మిమ్మల్ని కలిసి వెళ్దామని వచ్చాము!" అని గిఫ్ట్‌లను చూపించారు.

అవి చూడగానే నోరు తెరిచి పార పండ్లతో నవ్వింది.

లోపలికి రమ్మని పిలవగానే వెళ్లి సోఫాలో కూర్చున్నారు.

అందంగా ఉందనుకున్న ఆ ఇల్లు భయంకరంగా ఉంది. సోఫాలో కుక్క పడుకుని ఉంది. కుక్క జుట్టు అంతా సోఫాల నిండా ఉంది. ఇల్లంతా దుమ్ము... ఎక్కడ సామాను అక్కడే ఉంది. అందంగా కనిపించే ఉయ్యాలలో బట్టల మూట కనిపించింది.

యూట్యూబ్లో అందంగా కనిపించే ఆ ఇల్లు భూత్ బంగ్లాలాగా ఉంది.


ముగ్గురు ముఖా ముఖాలు చూసుకున్నారు.

"డమడమ గారు! మీ ఇల్లు చూడవచ్చా?" అని అడిగారు.

"దానికేమి భాగ్యం రండి!" అని లోపలికి తీసుకెళ్ళింది.

ఘోరాతి ఘోరమైన ఆ ఇంటిని చూడలేక పోయారు... వంటిల్లు అయితే చెప్ప తరం కాదు. అక్కడి వంట ఎవరు తిన్నా, తిన్నగా హాస్పిటల్‌కి వెళ్లడమే.

హాల్లో ఉన్న వాష్ బేసిన్ నిండా మరకలు నిండి అసహ్యంగా ఉంది... ఇక బాత్రూం ఏ లెవెల్‌లో ఉంటుందో అనుకున్నారు.




"టీ పెడతానుండండి! అక్కడి నుండి నా కోసం వచ్చారు మీరు!" అన్నది డమడమ వాళ్ళు తెచ్చిన గిఫ్ట్‌లని ఊహించుకొని.

"వద్దు! వద్దు!!" అని ముగ్గురు ఒకటేసారి అరిచారు.


మేము ఇక వెళ్తామండి. చాలా థాంక్స్ మీ అందమైన ఇల్లు చూపించినందుకు. అలాగే మీరు కూడా చాలా అందంగా ఉన్నారు!" అని చెప్పి... ఉరుకుల పరుగుల మీద జయప్రద ఇంటికి వచ్చి పడ్డారు.

"ఆ ఇల్లు ఏంటి అంత చెండాలంగా ఉంది? ఒక్కసారి మనవాళ్ళకి చూపిస్తే అర్థం అయ్యేది. యూట్యూబ్లో చూపించేదంతా నిజం కాదని! అయినా 24 గంటలు అద్దంలా పెట్టుకోవడం ఎవరికైనా కుదురుతుందా? పిల్లలు ఉన్న ఇంట్లో... సామాను కుదురుగా ఉంటుందా? వీలైనంతవరకు శుభ్రంగా అమర్చుకుంటాము. మన ఇళ్లే నయం ఆమె ఇంతకన్నా ఘోరంగా పెట్టుకుంది. అద్దంలా పెట్టుకోవడానికి ఇదేమైనా సినిమా సెట్టింగా?...

ఎవరి ఇల్లు అయినా ఓ మోస్తారుగా ఇలాగే ఉంటాయి. మన వాళ్ళకి ఒకసారి ఆ ఇల్లు చూపిద్దాము. అప్పుడు గాని నోళ్లు మూసుకోరు!" అని అనుకున్నారు. కాకపోతే వారికి ఒక సంతృప్తి మిగిలింది. యూట్యూబ్‌లో చూపించే ఇళ్ళు నిజంగా ఇలా ఉండవని.

ఇంట్లో వాళ్లకి ఈ విషయం ఎలా చెప్పి కన్విన్స్ చేయాలని ముగ్గురు ఆలోచనలో పడ్డారు.

ఈ మధ్య ప్రతిదీ యూట్యూబ్‌లో పెట్టడం, ప్రతి ఒక్కరికి అలవాటైపోయింది కదా! అని తలబాదుకున్నారు ముగ్గురూ!!





# నవ్వులాట


గాంధీ మనోహర్, 98490 51846

## ప్రేమలేఖ కాదు ప్రేమలేక ...

**కమలి, ప్రసాద్ ల పెళ్లి జరిగి వారం రోజులవ్వుతోంది. బయటికి వెళ్ళి ఇంటికి వచ్చిన కమలి తన భర్త ప్రసాద్ దగ్గరకి వచ్చి...**

**"నీ పేరు సూరిబాబు కాదు కదూ ?" అని ప్రసాద్‌ని డౌట్‌గా అడిగింది కమలి.**

**"ఎందుకు కాదు! నాపేరు సూరిబాబే... ఏం? ఎందుకు అడుగుతున్నావ్?" కాన్ఫిడెంట్‌గా చెప్పాలనే ప్రయత్నం చేశాడు ప్రసాద్.**




అది పసి గట్టిన కమలి–"శుక్రవారం పూట నిజం చెప్పు!... నీ పేరు సూరిబాబు కాదు కదూ?" నిజం చెప్పకపోతే నీ అంతు చూస్తా అన్నట్టు వుంది కమలి బిహేవియర్.

"నిజంగా నాపేరు ప్రసాదే!..." అని తడబ డుతూ... "సారీ!.. నాపేరు సూరిబాబే!" అని అన్నాడు.

"నిజంగా నీపేరు సూరిబాబా రా?"అని ప్రసాద్ చెంప చెళ్ళుమనిపించింది కమలి.

దెబ్బ తిన్న చెంపని చేత్తో రుద్దుకుంటూ...

"కాదు .. ప్రసాద్!" అని వస్తున్న కన్నీళ్ళు ఆపుకుంటూ అన్నాడు ప్రసాద్.

"దుర్మార్గుడా!...దుష్టుడా!...ప్రేమ ద్రోహి!... వంచకుడా ఎందుకురా నన్ను దారుణంగా మోసం చేశావ్?" అని భారీ ఆవేశంగా అడి గింది కమలి.

జరిగింది చెప్పడానికి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్ళాడు ప్రసాద్.

✦✦✦

ఈ కథలో ప్రోటాగనిస్ట్ అయిన సూరిబాబు వైజాగ్‌లో ఓ ప్రవేట్ కంపెనీలో ఉద్యోగం చేసు కుంటూ వుంటాడు.

ఇతని రూమ్ మేట్ ప్రసాద్ ఆటో డ్రైవర్‌గా ఉంటాడు.

ఎన్టీఆర్ తను తెలుగు దేశం పార్టీ విజయం సాధించాక తొలిసారి ముఖ్యమంత్రిగా హైదరా బాద్‌లో లాల్ బహదూర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేస్తున్నాడు.

ఇది చూడాలన్న అభిలాషతో సూరిబాబు సరదాగా వైజాగ్ నుండి వచ్చాడు.

ఆ ఫంక్షన్‌ని చూసుకుని మళ్ళీ వైజాగ్ వెళ్ళడానికి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరు కున్నాడు. తను వెళ్ళాసిన ట్రైన్ రావడంతో ఎక్కి కూర్చున్నాడు... కాసేపు అయ్యాక తనకి కేటాయించిన అప్పర్‌బెర్త్ ఎక్కి పడుకోబోతూ... అక్కడే ఓ కార్నర్‌లో పడున్న లేడీస్ హ్యాండ్ బ్యాగుని చూశాడు. అందులో డబ్బు ఏమైనా ఉందేమోనని ఆత్రుతగా ఆ బ్యాగు జిప్పు ఓపెన్ చేసి చూశాడు. అందులో కనీసం ఐదు వందల రూపాయలు కూడా లేదు. కమలి అనే పేరుతో టెన్త్ నుండి డిగ్రీ వరసకు అన్ని ఎడ్యూ కేషనల్ సర్టిఫికెట్స్ వున్నాయి.

ఆ సర్టిఫికెట్స్ అబ్బాయి పేరుతో వుండుంటే సూరిబాబు వాటిని పారేసి బ్యాగు మాత్రం తీసుకుని ఉండేవాడు. కానీ కమలి అనే పేరు ఉండడంతో వాటిని ఆమె అడ్రస్సుకు పంపి ఇంప్రెస్ కొట్టేసి... తద్వారా ఆమె ప్రేమను పొందాలని నిర్ణయించుకున్నాడు.

సూరిబాబు వైజాగ్‌లో దిగగానే పోస్టాఫీస్‌కు వెళ్లి ఊటీలో వున్న కమలి అడ్రస్సుకు వాటిని పోస్ట్ చేశాడు.

అది అందుకున్న కమలి... కృతజ్ఞతలు తెల్పుతూ నాలుగు పేజీల లెటర్ రాసింది.

ఇది లగాయతు ఇద్దరూ ఒకరికొకరు ఉత్త రాలు రాసుకుంటూ వుండిపోయారు.

ఇలా కొన్నాళ్ళు గడిచాక కమలిని సూరి బాబు ఫోటో పంపమని అడిగాడు.


"వద్దు!... మనమిద్దరం ఎలా ఉంటామో చూసుకోకుండా మనం కల్సుకోవాలి. అప్పుడే థ్రిల్, మజా వుంటుంది.వచ్చే నెలలో నేను ఓ చిన్న పనిమీద వైజాగ్ వస్తున్నాను. అప్పుడు మనం సర్ప్రైజ్‌గా కలుద్దాం." అని అంది కమలి.

అందుకు చచ్చినట్టు... 'సరే' అన్నాడు సూరి బాబు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు కోమలిని తను ప్రేమిస్తున్నట్టు లెటర్లో రాశాడు సూరిబాబు.

దానికి పాజిటివ్‌గా స్పందించింది కమలి.

అప్పటి నుండి ఇద్దరూ విచ్చలవిడిగా ప్రేమ లేఖలు రాసుసుకోసాగేరు.




దాంతో వాళ్ళ ప్రేమ దినదిన ప్రవర్ధమానం చెందుతూ వచ్చింది.

సూరిబాబు కోసం కమలి ఓ మంచి స్వెట్టర్ కొనీ, దాని మీద తన పేరుని గుర్తు చేసేట్టు 'కమలం' బొమ్మని అల్లి పంపించింది.

దాన్ని అందుకున్న సూరిబాబు హ్యాపీగా ఫీల్ అయ్యాడో లేదోగానీ,

"నువ్వు పంపిన స్వెట్టర్ నీ మనసులాగే చాలా చాలా బావుంది. ఈ రోజు చలిలో వేసుకుని తిరిగాను. అది వేసుకున్నంత సేపూ నీ వెచ్చని కౌగిలిలో నేను ఒదిగిపోయినట్టు అనిపించింది. నీ రాక కోసం ఎదురుచూస్తూ వున్నాను... ఇట్లు. ముఖపరిచయం లేని నీ ప్రియుడు సూరిబాబు " అని లెటర్లో రాశాడు.

అది చదివిన కమలి హ్యాపీగా ఎగిరి గంతు లేసింది.

ఇలా వుండగా ... వెరీ ఫైన్ డే సూరిబాబు పని చేస్తున్న ఆఫీసుకు తమ బాస్ కూతురు స్నేహ వచ్చింది.


ఆ అమ్మాయికి సూరిబాబు ఎందుకో నచ్చేశాడు. దాంతో తను సూరిబాబుని ప్రేమిస్తున్నట్టు సిగ్గూ శరం లేకుండా అతనితో చెప్పేసింది.

అందంగా ఉండడమే కాకుండా కోట్ల ఆస్తి వున్న స్నేహను ఎవరు కాదనుకుంటారు. కాబట్టి సూరిబాబు కూడా నో అని చెప్పకుండా ఎస్ అని చెప్పేశాడు.

సూరిబాబు తన రూమ్‌మేట్ ఆటో ప్రసాద్‌కి సదరు గుడ్‌న్యూస్ చెప్పాడు.

"రేయ్!... నువ్వు కమలిని ప్రేమిస్తున్నావు కదా?... ఆ సంగతి మర్చిపోయావా?... నీకు ప్రేమగా పంపిన స్వెట్టర్ సంగతి గుర్తు లేదా?" అని పాయింట్ లేవనెత్తాడు ప్రసాద్.

" రేయ్! నేను తన సర్టిఫికెట్స్ పంపినందుకు కృతజ్ఞతగా ఆ స్వెట్టర్ పంపింది! అంతే గానీ మా మధ్య ప్రేమా లేదూ లవ్వూ లేదూ!" అని దారుణంగా అబద్ధం ఆడేశాడు.




అంతే కాకుండా కమలి ఇచ్చిన స్వెట్టర్‌ని ప్రసాద్‌కి ఇచ్చేస్తూ–" రేయ్! ఇది నాకు టైట్ అయింది. నువ్వు తీసుకో!" అని అన్నాడు.

స్నేహ తనని ప్రేమిస్తున్నందుకు... తన ఫ్రెండ్స్‌ని పిలిచి తన రూమ్ లోనే పార్టీ ఇచ్చాడు సూరిబాబు.

ఫ్రెండ్స్ అందరూ పీకల దాక తాగీ... ఆ రాత్రంతా నానా రచ్చ చేశారు.

ఇది తెలుసుకున్న రూమ్ ఓనర్ సూరిబాబు, ప్రసాద్‌ని ఖాళీ చేయించి పంపేశాడు.

కమలి తను బయలుదేరి వచ్చే ముందు తను వైజాగ్ ఏ తేదీన వస్తోందో అది తెలియజేస్తూ సూరిబాబుకు లెటర్ రాసింది. కానీ సూరిబాబు ఆ అడ్రస్సులో ఇప్పుడు లేడన్న మ్యాటర్ కమలికి తెలీదు.

తర్వాత కమలి తను చెప్పినట్టు వైజాగ్ వచ్చింది.

అలాగే సూరిబాబు వున్న రూమ్ అడ్రస్సుకు కూడా వచ్చింది.

సూరిబాబు ఖాళీ చేసి వెళ్లిపోయాడని అక్కడి వాళ్లు కమలితో చెప్పారు.

సూరిబాబు ఇప్పుడు ఎక్కడ వున్నాడో... ఏ అడ్రస్సులో వున్నాడో తెల్సుకోలేక పోయింది.

సూరిబాబు ఎలా ఉంటాడో ముఖ పరి

చయం లేకపోవడం వల్ల రోడ్ మీద తిరుగుతూ వెతికే అవకాశం లేకుండా పోయింది.

కమలి తను వచ్చిన పని చూసుకుని వెళ్ళి పోతున్నట్టు రైల్వేస్టేషన్‌కు ఆటో ఎక్కింది.

ఆ ఆటో ప్రసాద్‌ది. ప్రసాద్‌కు ఆ అమ్మాయి కమలి అని తెలీదు. కమలికి అతను సూరిబాబు ఫ్రెండ్ అని తెలీదు.

కమలిని ప్రసాద్ చూడగానే ఆమె అందానికి ఫిదా అయిపోయాడు. పెళ్ళంటూ చేసుకుంటే ఇలాంటి అమ్మాయినే చేసుకోవాలని మనసులో అనుకున్నాడు.

సూరి బాబుకు కమలి పంపిన స్వెట్టర్ ఇప్పుడు ప్రసాద్ ధరించి వున్నాడు. కాకపోతే దాని మీద ఖాకీ చొక్కా వేసుకుని వున్నాడు. అంచేత కమలి ఆ స్వెట్టర్‌ని తను పంపినదే అని గుర్తించలేక పోయింది.

రైల్వే స్టేషన్‌లోకి వచ్చాక కమలి–

"వద్దు వద్దు" అంటున్నా వినకుండా ప్రసాదే లగేజీని మోసుకుని వచ్చి ట్రైన్ ఎక్కించాడు.

కమలి ఆటో ఛార్జీ డబ్బులు ఇచ్చినా ప్రసాద్ తీసుకోకుండా ట్రైన్‌లో నుండి దిగి కమలినే చూస్తూ బయట నిలబడ్డాడు.

ట్రైన్ మూవ్ అయింది.

కమలి వెళ్ళిపోతున్నందుకు దీనంగా చూస్తూ నిలబడ్డాడు ప్రసాద్.

ఇంతలో టీ అమ్ముకునే వాడు పొరపాటుగా ప్రసాద్ షర్ట్ మీద టీని పోశాడు.

దాంతో ప్రసాద్ తన షర్ట్‌ని విప్పేశాడు.

ఇప్పుడు ప్రసాద్ వేసుకున్న స్వెట్టర్‌ని కమలి గుర్తుపట్టి వెళ్తున్న ట్రైన్‌లో నుండి గబుక్కున దూకేసి పరుగున ప్రసాద్ దగ్గరకు వచ్చి–

"నువ్వు సూరిబాబువి కదూ?" అని అడిగింది స్వెట్టర్ మీద వున్న కమలం బొమ్మనే చూస్తూ.

ప్రసాద్ తను ఎవరో చెప్పకుండా–

"నువ్వు కమలివా ?" అని ఆ అమ్మాయిని అడిగాడు.

"ఔను!" అని ప్రసాద్ రిప్లై కోసం చూడ కుండా టక్కున అతనిని హగ్ చేసేసుకుంది కమలి.

తను సూరిబాబుని కాదు అంటే... అందమైన కమలి తనకి దక్క కుండా పోయే ప్రమాదం వుందని గ్రహించాడు ప్రసాద్.

దాంతో తనే సూరిబాబు అన్నట్టు కమలిని తన బాహువుల్లో మరింత గట్టిగా బంధించాడు ప్రసాద్.

✦✦✦

ఫ్లాష్ బ్యాక్ చెప్పడం ముగించాడు ప్రసాద్.


"సూరిబాబు ఇప్పుడు ఎక్కడ వున్నాడు?" అడిగింది కమలి.


"తన గర్ల్‌ఫ్రెండ్‌తో కల్సి ప్లెజర్‌ట్రిప్‌గా గోవా వెళ్ళాడు." అని చెప్పాడు ప్రసాద్.


సూరిబాబు చేసిన మోసం గుర్తు చేసుకుని వస్తున్న బాధని ఆపుకుంటూ ప్రసాద్‌ని హగ్ చేసుకుంటూ...

"సారీ ప్రసాద్!" అంది కమలి.

# ఈడో రకం ఆడో రకం దొంగ






డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*తెలుగు అధ్యాపకుడు, కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ*
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

**(జూలై సంచిక తరువాయి)**

**"శ్రీ**వారూ... శ్రీవారూ! ఎక్కడండీ? మా మేనత్త మనవరాలు మానస టీవీలో వస్తోందటండీ. అబ్బా, అబ్బా... చూస్తుంటే ముచ్చటేస్తోంది. తెలుగు ఎంత బాగా మాట్లాడుతోందో చూడండి..." అంటూ కంపెనీ సైరెన్ లాగా రత్నం ఆపకుండా వాగుతూ... నా దగ్గరకు రానే వచ్చింది.

కీచురాయి గొంతుతో అరుస్తూ ఒక్కసారిగా మీదకు వచ్చిన రత్నం వేగాన్ని తట్టుకోలేక ఉరుము శబ్దానికి హడలిపోయినట్లు అయింది నా పరిస్థితి. ఉదయాన్నే కాఫీ తాగి, అలా పేపరు చదువుతూ కునికిపాట్లు పడుతున్న నా ప్రశాంతతకు శుభం కార్డు పడినట్లు అర్థమైంది.

"రత్నం! ఏమిటే ఉదయాన్నే నాకీ ఉరుముల సుప్రభాతం. బడికి ప్రశాంతంగా వెళ్ళనియ్యవా?" అంటూ నా గోడు చెప్పుకుందామనుకున్నా... కానీ, అంతలోనే...

"ఆ అదేనండీ...అది చెబుదామనే వచ్చాను. అదేదో భక్తి కార్యక్రమంలో తానే వ్యాఖ్యాత అట. మా మేనత్త ఇప్పుడే ఫోన్ చేసి చెప్పింది... టీవీ చూడవే అని! ఇదిగో చూడండి!" అంటూ సెల్‌ఫోన్‌లో టీవీ పెట్టి చూపించింది.


"ప్రేక్షకులందరికీ నమస్కారం... షుప్రభాత వేళ దేవదేవుడిని ద్యానిద్దాం. మద్యమావతి రాగంలో ఈ కీర్తన వింటూ, సిద్ది వినాయక స్వామిని తలచుకుందాం. గనపతి బగవానుడి అనుగ్రహం ద్వారా... శిరిసంపదలు, సాంతి సౌభాగ్యాలు పొందుదాం.' అంటూ ప్రకటించేసింది ఆ వ్యాఖ్యాత... అదే మా రత్నం మేనత్త మనవరాలు.

"ఇంకెక్కడి సౌభాగ్యం. ఈ వ్యాఖ్యానం విన్నాక వినాయకుడు వెంటనే ధన్వంతరి దగ్గరకు పరుగెత్తాలి. ఆయన మానసిక క్షోభ ఎవరు తీరుస్తారో..." అంటూ ఆవేశం పట్టలేక బయటకే అనేసా.

'అనవసర వ్యవహారాల్లో తలదూర్చి, మాట్లాడకండి' అని అంతకు ముందే దినఫలాల్లో చదివినా, బుర్రకి ఎక్కలేదు మరి.


"కచ్చితంగా ఇలాగే అనుకుంటున్నా... ఇంకా ఏ వ్యాఖ్యానం చేయలేదేంటీ మహానుభావుడూ అనీ... అసలు మావాళ్ళంటేనే ఒంటికాలి మీద లేస్తారు. బంగారుతల్లి ఎంత చక్కగా మాట్లాడుతోందో? చూసి తట్టుకోలేరు. కుల్లు మీకు!" అంటూ మూతిని ముప్పై వంకర్లు తిప్పింది.

"రత్నం! నీకు బంధుప్రేమే కానీ భాషా ప్రేమ లేదోయ్! ఎంత మీ మేనత్త మనవరాలు టీవీలో చెప్పినా... షుప్రభాత సమయంలో నిద్రలేవటం దేవుడికి సాధ్యం కాదు. ఎందుకంటే, అది సుప్రభాత సమయం. షుప్రభాతం కాదు. సుప్రభాతం అంటే మంగళకరమైన ఉదయం అని అర్థం. ఫ్యాషన్ ఎక్కువై, 'సు' అనే అక్షరాన్ని 'షు' అని చదవటం టీవీ యాంకర్లకు ఈమధ్య బాగా అలవాటైంది. షుప్రభాతం అనే పదానికి అర్థం ఏదీ లేదు.




అలాగే, ద్యానిద్దాం అనే పదం కూడా తప్పు. ధ్యానిద్దాం అని ఒత్తుతో పలకాలి. అవసరమైన చోట ఒత్తు పలకకపోవటం, అనవసరమైన చోట పలకటం వల్ల పదాల ఉచ్చారణ మారిపోతుంది. ఒక్కోసారి

విపరీతార్థాలు వచ్చే ప్రమాదం కూడా ఉన్నది. ఉదాహరణకు మానస పలికిన మాటే ఉన్నది కదా... **'మద్యమావతి'** రాగం అని. ఇలా పలకటం తప్పు. **'మధ్యమావతి'** అని పలకాలి. మద్యం అనే పదానికి అర్థం అందరికీ తెలిసిందే కదా! మధ్యమావతి అనేది సంగీతంలో ఓ రాగం పేరు. పంచమ స్వరం లేని రాగం అది. ఒత్తు పలకకపోవటం వల్ల ఎంత విపరీతార్థం వచ్చిందో గమనించావా? **సిద్ది** వినాయకస్వామి అనేది కూడా తప్పు పదం. **సిద్ధి** అని ఒత్తు పలకాలి.




భాష అంటే ఏదో నాలుగు మాటలు మాట్లాడటం కాదు రత్నం. మనం పలికే ప్రతి పదం వెనకా ఆర్ద్రత ఉండాలి. చక్కటి భావం పలకాలి. నువ్వు గమనించావో లేదో... మానస ఇందాక మాట్లాడిన మాటల్లో చాలా దోషాలు ఉన్నాయి. **గనపతి** కాదు **గణపతి** అనాలి. **బగవానుడు** కాదు **భగవానుడు** అని పలకాలి. అలాగే రాయాలి కూడా.

ఘోరమైన విషయం ఇంకోటి చెప్పనా.... ఏదో ఫ్యాషన్ అనుకుని, స్టైలిష్‌గా మాట్లాడటం గొప్ప అనుకుని టీవీ యాంకర్లు, వాళ్ళని చూసి యువతరం ఏవో హొయలు పోతూ మాట్లాడుతున్నారు. వీళ్ళ ఉచ్చారణలో ఎన్నో దోషాలు వస్తున్నాయి. వాళ్ళకి కూడా ఆ వివరం తెలియదు. ఇందాక మానస **'శిరి సంపదలు'** అని పలికింది. 'శిరి' అంటే 'చంపేవాడు'... 'ఆయుధం' అనే అర్థాలు ఉన్నాయి. 'సిరి' అంటే 'లక్ష్మి' అని అర్థం. ఏదో స్టైల్ అనుకుని 'సి'ని 'శి' గా పలికితే అర్థం ఎంతగా మారిపోయిందో గమనించావా? **'సిరి సంపదలు'** ఇలా పలకాలి!

అలాంటిదే **'సాంతి సౌభాగ్యాలు'** అనే పదం కూడా. **'శాంతి సౌభాగ్యాలు'** అని పలకాలి. అలాగే, రాయాలి కూడా.

'స', 'శ' అనే అక్షరాల్ని పలికేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించుకోకపోతే ఎన్నో అర్థాలు మారిపోతాయి. ఇవేమీ కష్టమైన విషయాలు కావు. భాష పట్ల మన నిర్లక్ష్య ధోరణి. అంతే!

"ఓరి దేవుడో! ఈ ఒత్తులు, పొల్లుల గోలేమిటి స్వామీ. ఎంతో ఆనందంగా అమ్మాయి గురించి చెబుదామని వస్తే పొద్దున్నే క్లాస్ పీకుతారా? మహాప్రభో! మీకూ, మీ భాషకూ వెయ్యి నమస్కారాలు....

అసలు మిమ్మల్ని అని ఏం లాభం... మా నాన్నని అనాలి. ఆ బెంగళూరు సంబంధం... అంటుండగానే... అమ్మా... పాలు పొంగి గిన్నె మాడిపోయిందే..." అంటూ నా చిన్నారి మనోజ్ఞ కేక వెయ్యటంతో వంటింట్లోకి పరిగెత్తింది రత్నం.

"నాన్నా! ఇక మనం బడికి వెళ్దాం... తొందరగా తయారవ్వు!" అంటూ ముసిముసి నవ్వులు నవ్వింది చిన్నారి. **(సశేషం)**



# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

## ఆ ఉద్యోగం అందుకే...

**"అదేవిటి మధు! మళ్లీ వెనక్కి వెళ్తానంటున్నావ్... ఇంత మంచి అవకాశం ఎవరికి వస్తుంది చెప్పు! మందిలో కొంతమంది చెంతకే ఇలాంటి వెన్నముంత లాంటి అవకాశం వస్తుంది. అలాంటి అవకాశం ఈ రోజు నీ చేతికొచ్చింది... దానిని కాలుతో తన్నకు. అలా తన్ని... మళ్ళీ వెనక్కి వెళ్లి... ఆ చిన్న మిఠాయి కొట్టుని గర్వంగా నడుపుతానంటావేంటి? నీకేమైనా మతి గానీ శృతి తప్పిందా...**



...అయినా అరాకొరా సంపాదన వచ్చే ఆ మిఠాయి కొట్టు ఎందుకు! దర్జాగా ఒక కాలు మీద ఇంకో కాలేసుకుని, ఒక పక్క జీతాలు, కొంతమందిలాగా లంచాలు మెక్కి... వెండి కంచాలలో తిని... సంచుల నిండా బంగారం కూడ బెట్టి, కొద్ది కాలంలోనే కోటీశ్వరుడివి అయిపోయి, దర్జాగా కోటూ, బూటు వేసుకుని తిరగొచ్చు! ఇక వెనక్కి తిరిగి చూసే అవకాశం ఉండదు. కనుక నా మాట విని నీ నిర్ణయాన్ని మార్చుకో! ముందుకే వెళ్ళిపో... మళ్లీ ఆ నీ రోత పాత జీవితానికి వెళతానని కలలో కూడా అనకు! ప్లీజ్!!" చెప్పింది లలిత.

"అలాంటి కూతలు కూసి... నా గుండెని కోత పెట్టకు లలితా! కేవలం నిన్ను దక్కించుకోవడం కోసం మాత్రమే గవర్నమెంట్ ఉద్యోగాన్ని సంపాదించాను. అంతేగాని... నువ్వు అన్నట్టు ఆశకి పోయో, అంతస్తు కోసమో, హోదా కోసమో మరో దానికోసమో కాదు!... నువ్ మీ నాన్నకి మన ప్రేమ గురించి చెప్తే... అతను నిప్పు మీద ఉప్పులా పేలిపోయి... ఒప్పుకో లేదని చెప్పావ్! గవర్నమెంట్ ఉద్యోగం వుంటేనే నిన్ను నాకు ఇచ్చి పెళ్లి చేస్తానని చెప్పాడని చెప్పావు. ఓ తండ్రిగా కూతురి బాధ్యతను తీసుకునే ఒక మంచి అయ్య చేతుల్లో పెట్టాలని ఆయననుకున్నాడు. అందుకనే ఆయన్ని వ్యతిరేకించడం నాకు కరెక్ట్ కాదనిపించింది. అందుకనే ఆయన ఇష్ట ప్రకారమే ఉద్యోగం వచ్చాకే మనస్ఫూర్తిగా నిన్ను పెళ్లి చేసుకోవాలని అనుకున్నాను. అందుకనే మంచికో, చెడుకో కష్టపడి ఈ గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించుకున్నాను. ఓ పక్క నిన్ను వదులుకోలేక, మరో పక్క మీ నాన్నను ఒప్పించలేక నేను ఈ గవర్నమెంట్ ఉద్యోగాన్ని సాధించాల్సి వచ్చింది. అంతే తప్ప... నువ్వు అనుకున్నట్టుగా కాదు. కనుక ఇప్పుడు నువ్వు నా దానివయ్యావు. శాశ్వతంగా ఇక నువ్వు నా దానివి. అలాంటప్పుడు నేను ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా హాయిగా స్వేచ్ఛగా తీసుకోవచ్చు. నువ్వు నాకు దక్కవనే బెంగలేదు. అందుకనే మళ్ళీ నాకు ఇష్టమైన ఆ మిఠాయి దుకాణం తెరుస్తాను. ఈ గవర్నమెంట్ ఉద్యోగం విడిచి పెట్టేస్తాను. మళ్ళీ వెనక్కి వెళ్లి, చక్కగా లడ్డూలు చుట్టుకుంటూ, జంతికలు పిండుకుండూ, పిండివంటలు వండుకుంటూ మిఠాయి కొట్టు నడుపుకుంటాను. అదే నాకు గంపెడు లడ్డూల సంతృప్తిని ఇస్తుంది... ఈ కొద్ది నెలలు ఆ మిఠాయి దుకాణం మూసేసినందుకే, మా స్వీట్‌షాప్‌లో ఆర్డర్ ఇచ్చే నా కష్టమర్లు చాలామంది, ప్రేమతో ఫోన్ చేసి, సంగతి తెలుసుకుని తెగ బాధపడిపోయారు... కొందరు నేరుగా కలిసి, తెగ ఇదైపోతూ అడిగారు. నేను వాళ్ళ కళ్ళు తుడిచి, ఏమీ జరగలేదు... ఉద్యోగ ప్రయత్నంలో కొన్నాళ్ళు ఇలా... మూసివేయాల్సి వచ్చింది, పెళ్లి కూడా ఉండడంతో తప్పక మూసేసానని సర్ది చెప్పాను.

దాంతో వారందరూ సంతోషించి, త్వరలోనే తెరవాలని ఒట్టేయించుకున్నారు. ఇది ఒక బిజినెస్ మాత్రమే కాదు, దీని ద్వారా ఎంతోమంది నాకు చేరువయ్యారు. ఎంతోమందితో నాకు అనుబంధం ఉంది. కాబట్టి నా లైఫ్‌లో ఈ దుకాణం ఎంతోమందిని కలిపే వైఫై లాంటిది. అర్థం చేసుకో! పైగా ఆదాయం కూడా ఇందులో బావుంటుంది. ఈ బిజినెస్‌లో పై స్థాయికి వెళ్ళాలని, నా స్వీట్స్ అంతర్జాతీయ స్థాయిలో కూడా ఎక్స్‌పోర్ట్ అవ్వాలని...ఇలా ఎన్నో కలలింకా మిగిలున్నాయ్!" చెప్పాడు మధు.

"మధు!... మా నాన్న కండిషన్ పెట్టాడని

కాదు, ఇప్పుడు ఆ బిజినెస్ బాగానే ఉండొచ్చు, కానీ... కరోనా లాంటి టైంలో ఆ బిజినెస్ ఏమైంది? కనుక ఎప్పుడు బిజినెస్‌లు ఎలా ఉంటాయో మనం చెప్పలేము. తర్వాత ఎప్పుడైనా లాస్ వస్తే మనం రోడ్డున పడాలి. అదే నీకు ఒక గవర్నమెంట్ జాబ్ కానీ ఉంటే, చక్కగా సొసైటీలో మంచి స్టేటస్ ఉంటుంది. అందరిలో చెప్పుకోవడానికి చాలా హుందాగా బాగుంటుంది. అలా కాకుండా ఇలా చిన్న మిఠాయి దుకాణం నడుపుకోవడం అంటే నాకే కొంచెం చిన్నతనంగా ఉండదూ. పైగా మా ఫ్యామిలీలో అందరూ కూడా పెద్ద పెద్ద గవర్నమెంట్ ఉద్యోగస్తులే. నువ్వే మరొకసారి పెద్ద మనసు చేసుకొని నన్ను అర్థం చేసుకోవాలి!" బ్రతిమాలింది లలిత.


"ఎవరో ఏదో అంటారని... ఎవరో ఏదో అనుకుంటారని, మనం మన ఇష్టాలు మార్చుకోకూడదు. నువ్వు నన్ను అర్థం చేసుకునే దానివి, నువ్వు కూడా ఇలా అనడం నాకు మింగుడు పడ్డం లేదు. ఎక్కువ డబ్బు ఎవరి దగ్గర ఉంటే, వారిదే ఇపుడు పెద్ద స్టేటస్. అదే ట్రెండ్, కనుక నువ్వు నా గురించి బాధపడ నక్కర్లేదు. పైగా ఈ స్వీట్ షాపు ఇప్పుడు చిన్నదే కావచ్చు, రేపు పెద్దది అవుతుంది. తర్వాత ఇం...కా పెద్దది అవుతుంది. ఇవన్నీ పక్కన పెడితే, అందులో నాకు బోలెడు తృప్తి ఉంది. నాకు ఇష్టమైన పని చేయడంలో ఎంతో ప్రేమ ఉంటుంది...నీకు తెలుసు కదా! అదే ఈ జాబ్ అయితే నైన్ టు ఫైవ్ మెకానికల్‌గా చేయాలి. అది నీకు ఇష్టమా? నేను యంత్రంలా యాంత్రికంగా మారిపోవాలని కోరుకుంటున్నావా?" అడిగాడు.


"అయితే విను మధు! మన పెళ్లికి మా నాన్న చప్పున ఒప్పేసుకున్నాడు కానీ... నాకే మిఠాయి దుకాణం, అదే ఆ చిన్న మిఠాయి దుకాణం నడిపే వాడిని చేసుకోవాలంటే... ఏదోలా అనిపించింది. అందుకే, నేనే మా నాన్నతో ఆ కండిషన్ పెట్టమని బలవంత పెట్టాను. దాంతో నువ్వు ఆ మిఠాయి దుకాణం వదిలి ఏదో ఒక జాబ్లో సెటిల్ అయ్యి... ఆ తర్వాత నన్ను పెళ్లి చేసుకుంటావనుకున్నాను. ఆ తర్వాత మిఠాయి కొట్టుని గాలికి వదిలేస్తావ్ అనుకున్నాను... కానీ మళ్ళీ నువ్వు పెళ్లి అయ్యాక కూడా వెనక్కి వెళ్లి అదే మిఠాయి కొట్టు నడుపుకుంటానంటున్నావ్. అదే నాకు అంతు చిక్కడం లేదు. ఒకవేళ నీ నిర్ణయం అదే అయితే గనుక... నేను కూడా వెనక్కి వెళ్లాల్సి ఉంటుంది, అదే మా పుట్టింటికి!" చెప్పిందామె.

"అయితే వెళ్లేముందు నా మాట కూడా విను. నువ్వు ఈ కండిషన్ పెట్టించావని నాకు రెండ్రోజుల క్రితమే మీ నాన్న ద్వారా తెలిసింది. అది అడిగి నీ మనసు నొప్పించకూడదనుకున్నాను. పైగా నేను కూడా నీ దగ్గర ఓ నిజం దాచాను. చెల్లుకి చెల్లని గమ్మున ఊరుకున్నాను!" చెప్పాడు.

"నిజమా!?ఏంటది?" దేభ్యం మొహంతో అడిగింది

"నిజం ఏంటంటే... నేను నీకు చూపించిన అపాయింట్మెంట్ లెటర్, జాయినింగ్ లెటర్, ఆ గవర్నమెంట్ ఉద్యోగం అన్ని ఫేక్! కేవలం నిన్ను నా దాన్ని చేసుకోవడానికి గాను నేను నిన్ను మోసం చేయాల్సి వచ్చింది... ఈ విషయం మీ నాన్నకు ముందే చెప్పాను. కానీ ఆయన నీకు చెబితే నువ్వు అసలు పెళ్లికి ఒప్పుకోవని, తర్వాత ఇద్దరి మధ్య వైరం వచ్చి విడిపోయే అవకాశం ఉందన్నాడు. కనుక చెప్పొద్దన్నాడు. దాంతో నేను నీకు చెప్పలేదు. అదీ జరిగింది, కనుక నేను వెనక్కి వెళ్తున్నాను... నువ్వు వెనక్కి వెళ్తావా లేదా అనేది నువ్వే నిర్ణయించుకోవాలి మరి!" చెప్పడంతో ఆమె తెల్ల మొహం వేసింది.



# అపరంజి బొమ్మ

కట్టా రాంబాబు, 9440140510

**అందమైన అమ్మాయికి అంతకంటే అందమైన చిరునవ్వు తోడైతే చూసేవాళ్ళకి కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. ఇది నిజంగా నా అనుభవపూర్వకంగా తెలిసింది.**

**ఈ రోజు ఉదయం లేచి బాల్కనీలోకి వెళ్ళిన వెంటనే జీవితంలో మరిచిపోలేని అందమైన అనుభవం కలిగింది. ఓ అందాలరాశి మా ఎదురింటి బాల్కనీలో నిలబడి నవ్వుతూ ఆ పరిసరాల్ని చూస్తూ నా వంక చూసినప్పుడు నవ్విన అందమైన నవ్వు నా హృదయాన్ని తాకి గిలిగింతలు పెట్టింది.**

**ఆడపిల్లలు అందంగా వుంటారని తెలుసు గానీ ఇంతందంగా వుంటారని, అందులోనూ ఇంతందంగా నవ్వుతారని తెలీదు.**

నిన్నటివరకు ఖాళీగా వున్న ఎదురింట్లోకి ఎవరో కొత్తగా వచ్చినట్లున్నారు.

కాఫీ పట్టుకొచ్చిన అమ్మనడిగాను.

"ఎవరైనా కొత్తగా దిగారా?" అని.

"అవున్రా! నిన్ననే వచ్చారు. అప్పటికే నువ్వు ఆఫీసుకెళ్ళిపోయావు. రాత్రి లేటుగా వచ్చావుగా నీకు చెప్పలేదు. మీ డాడీకి తెలిసినవాళ్ళేలే." అంది అమ్మ.

ఆఫీసుకెళ్ళానన్న మాటే గానీ పదేపదే అందమైన ఆ అమ్మాయి ముఖం, మరింత అందమైన ఆమె చిరునవ్వు గుర్తుకొస్తున్నాయి.

ఆఫీసునుంచి ఇంటికొచ్చిన వెంటనే అమ్మ ఆ అమ్మాయి గురించి మరిన్ని విషయాలు చెప్పింది.

ఆ అమ్మాయి పేరు 'అపరంజి' అట. నిజంగా స్వచ్ఛమైన బంగారంలాగే వుంది. అపరంజి తల్లీ, తండ్రి ఆమె చిన్నప్పుడే చనిపోయారట. అన్నావదినల దగ్గరే వుంటుందంట. డిగ్రీ పూర్తి చేసిందట.

రోజూ ఆ అపరంజి బొమ్మను చూడకుండా వుండలేని స్థితి కొచ్చేసాను.

ఉదయం లేచి బాల్కనీలోకి వెళ్ళేసరికి తనూ ప్రత్యక్షమయ్యేది. చుట్టూ పరిసరాలను చూస్తూ పరవశించి పోయేది. ఆమె అలా నవ్వుతూ చూస్తూండిపోయేవాడిని. ఓ క్షణం నా నవ్వుతో ఆమె నవ్వు కలిసేది. అలా చూసినప్పుడు ఆమె నాగురించి ఏమనుకునేదో తెలీదు కాస్సేపు అక్కడే వుండి, ఆఫీసుకు వెళ్ళాలి కాబట్టి అక్కడ నుండి వచ్చేసేవాడిని. మళ్లీ మర్నాటి వరకు నాకు కన్పించేది కాదు. ఆ అందాల అపరంజి బొమ్మ నవ్విన నవ్వు ఆమె ప్రేమలో పడేటట్టు చేసింది. అదేనేమో తొలిచూపులోని ప్రేమ. నా వాలకం అమ్మ కనిపెట్టినట్టుంది.

"ఏరా! ఆ అమ్మాయిని ఇష్టపడుతున్నావా?" అనడిగింది.

"అవునమ్మా!" అన్నాను ఇంక ముసుగులో గుద్దులాటెందుకని.

"అయితే నేను ఓసారి వాళ్ళింటికెళ్ళి మాట్లాడతాను." అంది అమ్మ.

నా ఆనందానికి అవధులు లేవు... అమ్మ కలగజేసుకుందంటే అది ఖచ్చితంగా జరిగి తీరుతుంది. ఇంక అపరంజి నా జీవితంలోకి వచ్చేసినట్లే. సాయంత్రం ఆఫీసునుంచి చాలా తొందరగా ఇంటికి బయలుదేరాను. అమ్మ శుభవార్త చెబుతుందని.

ఇంటికెళ్లి చూస్తే అమ్మ దిగులుగా కనిపించింది.

"ఏంటమ్మా! అలా వున్నావు?" అన్నాను.

"ఆ అమ్మాయి మీద ఆశ వదులుకోరా!... ఆమె నీకు కనపడలేదనుకో!" అంది అమ్మ.


నా గుండెల్లో రాయి పడినట్లయింది.

"ఏంటమ్మా నువ్వు మాట్లాడేది!" అన్నాను.

"అవున్రా! ఆ అమ్మాయిని నువ్వు చేసుకోలేవు. ఎందుకంటే అపరంజి అంధురాలు, మూగది కూడా... అలాంటి అమ్మాయిని నువ్వెలా చేసుకుంటావు చెప్పు? ఇంకామెను మరిచిపో!" చెప్పింది అమ్మ.

పిడుగుపడి గుండె ఆగినట్లయింది.

అక్కడనుంచి నా రూములోకెలా వచ్చానో తెలీదు. ఆ రాత్రి భోజనం చేయలేదు. నిద్ర పట్టలేదు. తెల్లవార్లూ అపరంజి గురించే ఆలోచన. ఆమె లేని జీవితాన్ని ఊహించలేక పోతున్నాను. ఇంక ఆమె గురించి వేరేగా ఆలోచించవలసిన అవసరం లేదు. ఆమె తోడిదే



నా జీవితం ఆమెకు కళ్ళు లేకపోతేనేం నా కళ్ళతో ఆమెకు లోకాన్ని చూపిస్తాను... తను మూగదాన్ననే ఆలోచన రానివ్వను. నా మాటలతో మురిపిస్తాను. అదే అమ్మకు గట్టిగా చెప్పేసాను. నేను అపరంజినే పెళ్లిచేసుకుంటానని. ఇప్పుడు మనసు ప్రశాంతంగా వుంది. అపరంజిని దగ్గరనుంచి చూడాలని, నా మనసులో తన పట్ల ప్రేమ ఎంత వుందో చెప్పాలని ఆశపడ్డాను గానీ అవకాశం రాలేదు.

ఓరోజు ఆఫీసునుంచి ఇంటికొచ్చి లోపలికి అడుగుపెట్టే సమయంలో హాల్లోనుంచి నవ్వులు వినిపిస్తున్నాయి.

“ఏంటాంటీ! మీ అబ్బాయి వట్టి పిరికివాడిలా వున్నాడు. నన్ను పెళ్లి చేసుకుంటానన్న పెద్దమనిషి కనీసం నన్ను చూడటానికి గానీ, నాతో మాట్లాడడానికి గానీ రాలేదు... పోనీ ఫోన్ కూడా చేసి మాట్లాడలేదు.” ఓ తియ్యని స్వరం వినిపించింది.

“వాడు నిజంగా బుద్ధిమంతుడమ్మా! వాడికలాంటివి నచ్చవు. నీమీద వాడి ప్రేమ నిజమైంది అవునో కాదో నువ్వు తెలుసుకోవాలన్నావు కాబట్టి నీకు కళ్ళు కనపడవని, మూగదానివని అబద్ధం చెప్పాను.” అంది అమ్మ.

‘ఎంత నాటకమాడారిరువురు’ అనుకుంటూ హాల్లోకొచ్చి గుండె పట్టుకుని ‘అబ్బా’ అంటూ కూలబడిపోయాను.

అపరంజి, అమ్మా ఇద్దరూ కంగారు పడిపోయారు.

“ఏమయ్యిందిరా?” అంటూ అమ్మ,

“ఏమయ్యిందండీ” అంటూ అపరంజి, నా దగ్గర కొచ్చారు.

“గుండెల్లో నొప్పిగా వుందమ్మా! హార్ట్‌అటాక్ ఏమో” అన్నాను.

డాడీ ఇంట్లో లేరేమో... అమ్మ ఏడుస్తూ కంగారు పడిపోతోంది అంబులెన్స్ పిలవడానికి. అపరంజి నా గుండెల మీద పడి భోరుమని ఏడుస్తోంది. మరింత ఏడిపించకూడదని అపరంజి ముఖాన్ని దగ్గరకు తీసుకుని నవ్వుతూ కన్ను గీటాను.

‘ఆ...!’ అంటూ నోరావలించి ఆశ్చర్యంగా నా వంక చూసింది. టక్కున ఆమె బుగ్గ మీద ఓ ముద్దు పెట్టాను.

ఓ అందమైన చిరునవ్వుతో నా గుండెల్లో తల దాచుకుంది. అమ్మ తెల్లబోయి మా ఇద్దరి వంకా చూసింది.




# నెల నెలా నవ్వుల వెన్నెల





**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం మీద** హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- మనోభావాలు


నిర్వహణ: **లాల్**


























మీ దిక్కుమాలిన 'మనోభావాలు' దెబ్బతిన్నందుకు తీరిగ్గా తర్వాత దెబ్బలాడుదురు, ఇంట్లో గ్రాసరీస తెండి డియర్!
ఢీ
ఢీ
హరి



ఏం?.. మాకు మాత్రముండవా మనోభావాలు?
ప్రపంచ గయ్యాళిభార్యల సంఘం
Sridhar



అతగాడి రుచులు అభిరుచులు నిక్కచ్చిగా గుచ్చి,గుచ్చి అడిగి తెలుసుకోమన్నాక్..అడిగేసరికి తన మనోభావాలు దెబ్బ తిన్నాయని వెళ్ళిపోయాడు!
తోపల్లి ఆనంద్


ఛీ...ఛీ...! ఏం మనుషులో...!! మనకూ 'ఫీలింగ్స్' ఉంటాయని వీళ్ళెప్పుడు తెల్సుకుంటారన్నా...!?
క్రిష్


నా మనోభావాలు దెబ్బ తినటం ఏంటి నా మొహం ... నేనే దెబ్బలు తింటుంటే ...?!


మీకు అమ్మా నాన్నా, అక్కా చెల్లెళ్ళు లేరంటేనే పెళ్ళికి చేసుకుంటాను అన్నందుకే.. మీ మనోభావాలు దెబ్బ తింటే ఎలాగండీ..?!
పెళ్ళిచూపులు


సర్.. ఇక్కడ ఎన్నైనా తిట్టండి పడ్తాను. స్టాఫ్ ముందు ఏమీ అనకండి.



# పదానందం-24

కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | ■ | 3 | ■ | 4 |
| | ■ | | ■ | 5 | | 6 | |
| ■ | 7 | | | | ■ | | ■ |
| 8 | ■ | | ■ | | ■ | 9 | 10 |
| | ■ | ■ | 11 | | 12 | ■ | |
| 13 | | | | ■ | | ■ | ■ |
| | ■ | ■ | | ■ | 14 | 15 | |
| 16 | | | | | ■ | | ■ |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. రాత్రిపూట మేల్కొని ఉండడం (3)
5. అదుపుతప్పి, శాంతిభద్రతలు లోపించిన పరిస్థితి (4)
7. పరాభవం (4)
9. ఖద్దరు (2)
11. యుద్ధాలలో వాడేది (3)
13. ప్రధాని నరేంద్రమోడీ స్వంతరాష్ట్రం చెదరిపోయింది (4)
14. ఎటునుంచైనా పేలుతుంది జాగ్రత్త (3)
16. వివాహానికి ముందుజరిగే తంతు (5)

**నిలువు**

1. ఆలస్యం (2)
2. ముగ్గు (4)
3. ....తీయడమంటే విషయమంతా రాబట్టడం (2)
4. పైకొచ్చిన ఒక లోహం (2)
5. తరువాత (4)
6. పత్తివడకే యంత్రం (3)
8. పైకి వృద్ధి (5)
10. ఇది ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలంటారు (2)
11. ఒక పార్టీనుంచి మరొక పార్టీకి మారడం (4)
12. ఏదైనా వస్తువుకు ఏర్పడిన డిమాండ్ (3)
15. కొత్తకాదు (2)

**సమాధానం వచ్చే సంచికలో**

**పదానందం-23 సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 చె | ప్పు | 2 దు | మా | 3 ట | లు | ✿ | 4 ది |
| దే | ✿ | పు | ✿ | తే | ✿ | ✿ | గు |
| 5 వు | 6 రు | క | 7 ఏ | ✿ | 8 తా | బే | లు |
| ✿ | మా | ✿ | 9 మ | వం | రు | ✿ | ✿ |
| 10 న | లు | గు | రు | ✿ | 11 మా | గా | 12 ణి |
| డ | ✿ | ✿ | 13 పా | లే | రు | ✿ | తం |
| 14 త | 15 డ | బా | టు | ✿ | ✿ | 16 తే | గ |
| ✿ | బ్బ | ✿ | ✿ | 17 కుం | దే | లు | ✿ |



తెలుగులో వెలువడుతున్న
ఏకైక హాస్య మాస పత్రిక

హాస్యానందం


చందాదారులుగా చేరండి!
నవ్వే లక్షణం మీ సొంతం చేసుకోండి!!



Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P




డా॥ కె.వి.రమణాచారి గారు
టి.టి.డి. ఈవో గా పని చేసిన
కాలంలో ఆయనకు ఎదురయిన
పరీక్షలు... విజయాలు...
అన్నీ అద్భుతాలే!
ఆ అద్భుతాల సమాహారం



ప్రతులకు సంప్రదించండి-
సాహితీ ప్రచురణలు, 33-22-2, చంద్ర బిల్డింగ్స్,
సి.ఆర్. రోడ్డు, చుట్టగుంట, విజయవాడ-520 004
ఫోన్: 0866 2436643

వెల: 150 రూపాయలు

Hasyanandam September-2025 RNI No. APTEL 08387/01/1/2003-TC



# అక్షజ్ఞ పబ్లికేషన్స్






ప్రచురణలు అభిరుచికి దర్పణాలు


రమణ గారి రచనలు




బాపు గారి బొమ్మలతో












AKSHAGNA PUBLICATIONS

ముళ్ళపూడి వెంకట రమణ గారి
పుస్తకాలు ఏడూ విడిగా
కొనుక్కుంటే..1475/- అవుద్ది!
ఓల్ మొత్తం ఒకేసారి కొంటే..
175/- కన్సెసను ఉండుద్ది !
అంటే 1300 /-
పోస్టల్ చార్జీలు తప్పవండోయ్



ఇంకొన్ని ప్రచురణలు...

ముళ్లపూడి శ్రీదేవి: రమణీయ శ్రీ భాగవతం.
బ్నిం: బాపుగారితో నేను, మిస్సస్ అండర్‌స్టాండింగ్, మరపురాని మాణిక్యాలు.
తనికెళ్ల భరణి: శివ చిలుకలు, భరణీయం. ఎమ్వీయల్: ముత్యాలముగ్గు, అధిక ప్రసంగం
చేంబోలు శ్రీరామ శాస్త్రి: సిరివెన్నెల తొలిగురువు, మనిషికి మరమ్మత్తు.

Scan the code for Akshagna Books

## Akshagna Publications

Phone: 8712729057, 8341450673, Email: akshagna.kruti@gmail.com
మా చిరునామ :12-11-1364, Parasara Apartments, 2nd Floor, Bouddha Nagar, Warasiguda,
Secunderabad 500061